RNI Reg.No. TELTEL/2017/74417

# తొలి పలుకు

THOLI PALUKU, Telugu Fortnightly

సంపాదకులు : డి.కుమార స్వామి

హైదరాబాద్ 15 ,ఆగస్టు, 2018 సంపుటి : 1 సంచిక 21 పేజీలు : 8 రూ : 10/-

## నీళ్లు ఇచ్చే దిశగా రిజర్వాయర్ పనులు వేగవంతం



టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకంతో తెలంగాణ రైతు ల్లో ఆత్మస్థైర్యం, ఆత్మ విశ్వాసం నింపామని సాగునీటి పారుదల శాఖ మం త్రి హరీష్ రావు స్పష్టం చేశారు. ఇర్కో డలో రైతుబీమా ధృవీకరణ పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లా డుతూ.. నిన్న రైతు బంధు, నేడు రైతు బీమా.. ఈ రెండు పథకాలతో సీఎం కేసీ ఆర్ రైతుల జీవితాల్లో భరోసా నిం పారని తెలిపారు. దేశంలో తొలిసారిగా సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతుబీమా పథకం తీసుకువచ్చారని చెప్పారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టండి అని ఎవరూ కేసీఆర్‌ను అడగలే దు. అంతగిరి రిజర్వాయరు ద్వారా ఈ ఏడాది నీళ్లు ఇచ్చే దిశగా పనులు వేగ^వంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇల్లంతకుంట లోని ప్రతి మ ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-10 రాజన్న సిరిసిల్లా జిల్లా-సిద్దిపేట జిల్లాలకు అనుసంధానంగా ఉన్న అంతగిరి రిజ ర్వాయరు పనుల పురోగతి పై రాజన్న సిరిసిల్లా జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, డీఆర్వో శ్యామ్ ప్రసాద్ లాల్, కాళేశ్వరం ప్రాజెక్ట ఈఎన్సీ హరిరాంలతో 5 గం టల పాటు సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రిజర్వాయరు క్షేత్ర స్థాయి పనుల పురోగతి పై అధికారులు, ఏజెన్సీలను ఆరా తీశారు. టన్నెల్ వి స్తరణ, లైనింగ్ పనులు ఈ యేడాదిలోపు పూర్తి చేయాలని ఏజెన్సీలను సమన్వయం చేసుకుని పనులు తొందరగా పూర్తి చేసేలా చొరవ చూపాలని అధికా రులకు ఆదేశాలు జారీ చేశారు. అంతగిరి రిజర్వాయరు పంప్ హౌస్, సర్జ్ పూల్ పనుల జాప్యం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల ద్వారా ప్రతి పల్లె చెరువులు, కుంటలు నిండేలా ప్ర ణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రధాన, కుడి, ఎడమ కాలువలకు ఇరువైపులా హరిత హారంలో భాగంగా కావాల్సిన ప్రణాళి కలు రూపొందించుకుని మొక్కలు నాటా లని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పంప్ హౌస్ పనులు, సర్జ్ పూల్, లైనింగ్, గేట్లు పనుల పురోగతి పై ఆరా తీస్తూ.. త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా పునరావాస కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు, ఆర్అండ్ ఆర్ కాలనీల వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ కు సూచించారు. అంతగిరి రిజర్వాయరు పనులలో భాగంగా ఇరిగేషన్ అధికారి సమర సేన పనితీరును మం త్రి అభినందించారు.




హరితహారంలో భాగంగా మున్సిపల్ కార్మికులతో భాగస్వామ్యంగా మొక్కలను నాటిన బీసీ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు/ఎడిటర్ తొలి పలుకు - దుంద్ర కుమారస్వామి , రంగారెడ్డి జిల్లా యూత్ ప్రెసిడెంట్ సాయి యాదవ్ మరియు ఇతరులు పాల్గొన్నారు .....ఇంటింటికి మొక్కను పంపిణీ చేస్తూ హరితహారంలో భాగస్వాములైన కార్మికులను బీసీ దల్ రాష్ట్ర అధ్యక్షుడు చేతుల మీదుగా సన్మానించడం జరిగింది .



సికింద్రాబాద్ లోని ఆర్పీ రోడ్ నందు కృషి సర్వీసెస్ షాపు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన టీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్ ,కార్పొరేటర్ ఆకుల రూప,కొమురవెల్లి మల్లన్న టెంపుల్ మెంబర్ ధర్మరాజ్ , బీసీ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి, రంగారెడ్డి జిల్లా యూత్ ప్రెసిడెంట్ సాయి యాదవ్ బీసీ దళ్ రాష్ట్ర కమిటీ మెంబర్ కనకయ్య పాల్గొన్నారు .ఘనంగా ప్రారంభోత్సవం జరిగింది .

## రైతుబీమాను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



దేశంలో రైతుబంధు, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీని వాస్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతుకు ప్రీమి యం చెల్లించి.. బీమా కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కూడా తెలంగాణే అని పేర్కొ న్నారు. నందిగామ మండల కేంద్రంలో రైతుబంధు జీవిత బీమా ధృవీకరణ పత్రాలను మంత్రి పోచారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 58 లక్షల మంది రైతులకు, కోటి యాభై లక్షల ఎకరాలకు, ఎకరాకు రూ. 8,000 చొప్పున మొత్తం రూ. 12,000 కోట్లను అందిస్తున్నామని తెలి పారు. కుటుంబానికి ఆధారమైన రైతు దురదృష్టవశాత్తు మరణించినా ఆ కు టుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడ కూడదనే మంచి ఉద్యేశంతో రాష్ట్రంలో రైతుబంధు జీవిత బీమా అమలు చేస్తున్నామని మంత్రి ఉద్ఘాటించారు. ప్రతి రైతుకు ప్రీమియంగా రూ. 2,271 చొ ప్పున మొత్తం 636 కోట్లను రాష్ట్ర ప్రభు త్వం ఎల్ఐసీ సంస్థకు చెల్లించడం జరి గిందని చెప్పారు. ఆగస్టు 14 రాత్రి నుంచి రైతుబంధు జీవితబీమా అమ లులోకి వస్తుంది. వచ్చే ఏడాది ఆగస్టు 13 వరకు వర్తిస్తుంది. కుటుంబానికి ఆధారమైన రైతు దురదృష్టవశాత్తు చనిపోతే, ఆ కుటుంబానికి ఆసరాగా రూ. 5 లక్షల బీమా అందుతుంది. రైతు చనిపోయిన పది రోజులలోనే నామినీకి రూ. 5 లక్షల చెక్కు అందుతుంది. ఈ రూ. 5 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేసుకున్నా 8 శాతం వడ్డీ చొప్పున ఏడాదికి రూ. 40,000 లభిస్తుంది.

# సామాజిక ఉద్యమంగా హరితహారం

భవిష్యత్ తరాల బాగు కోసం ముఖ్యమంత్రి కేసిఆర్ తెచ్చిన హరితహారం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. తెలంగాణలో అడవుల విస్తీర్ణం 23 శాతమే ఉందని, దీనిని 33 శాతానికి పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హరిత తెలంగాణ కావాలంటే, మన రాష్ట్రంలో పంటలు బాగా పండాలంటే, వానలు రావాలంటే, కోతులు వాపస్ పోవాలంటే హరితహారం లో అందరూ భాగస్వామ్యమై పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, సి ఎం నిర్ధేశించిన లక్ష్యాన్ని చేరాలన్నారు. ఈరోజు వరంగల్ అర్బన్ జిల్లా, తిమ్మాపూర్ గ్రామం, బెస్తం చెరువు దగ్గర పది ఎకరాల స్థలంలో మొక్కలు నాటి నాల్గవ విడత హరితహారాన్ని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఇక్కడ ప్రారంభించారు. తెలంగాణను హరిత తెలంగాణ చేసే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసిఆర్ హరితహారం పథకం రూపొందించి 230 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఈ 230 కోట్ల మొక్కలలో 120 కోట్ల మొక్కలను సామాజిక అడవుల్లో, 100 కోట్ల మొక్కలను అటవీ ప్రాంతంలో మరో 10 కోట్ల మొక్కలను హైదరాబాద్ లో నాటాలని నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మూడు విడతలుగా 81 కోట్ల మొక్కలు నాటారన్నారు. ఈ నాల్గవ విడతలో 40 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించారన్నారు. ఇందులో వరంగల్ ఉమ్మడి జిల్లాలో 5 కోట్ల మొక్కలు



నాటాలని అధికా రులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలను కోరారు. ఈ సంవత్స రం హరిత తెలంగాణ ? హరిత పాఠశాల పేరుతో విద్యాలయాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని నిర్ణయించామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. విద్యాలయాల్లో ఉన్న ఖాళీ స్థలాలు గుర్తించి పక్కా ప్రణాళిక రూపొందించి మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమంలో భాగస్వాములై హరిత పాఠశాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఇంటి ఆవరణలో, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులతో పాటు ఈ మొక్కలు పెరిగి, పెద్దవై మంచి భవిష్యత్ ఇస్తాయన్నారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటే ప్రాంతాన్ని పూర్తిగా దున్ని, లే అవుట్ చేసి మొక్కలను పద్దతి ప్రకారం నాటాలని అధికారులకు సూచించారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. తెలం గాణలో ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు హరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథల వైపు దేశం మొత్తం చూస్తోం దన్నారు. తెలంగాణలో భాగస్వామ్య ప్రజలు, చిత్తశుద్ధి ఉన్నఅధికారులు ఉండడం వల్లే ఈ పథకాలు విజయవంతమై అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయన్నారు. ఆగస్టు 15 నుంచి అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ కింద నీళ్లు ఇస్తామని, ఆ తర్వాత ఇంటింటికి నీరందిస్తామని చెప్పారు. అదేవిధంగా నిజాం కాలం నాటి చెరువులను మిషన్ కాకతీయ పథకం కింద పునరుద్ధరిస్తున్నామన్నారు. భవిష్యత్ తరాలు బాగుండాలని ఈ హరితహారం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నావన్నారు. ఈ హరిత హారం కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సిఎం కేసిఆర్ నిర్ధేశించిన లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ గద్దల పద్మ, ఎమ్మెల్యేలు కొండా సురేఖా, అరూరి రమేష్, చైర్మన్లు గుండు సుధారాణి, మర్రి యాదవరెడ్డి, వాసుదేవరెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ లలితా యాదవ్, కలెక్టర్ ఆమ్రపాలి, పోలీస్ కమిషనర్ రవీందర్, మునిసిపల్ కమిషనర్ గౌతమ్, వరంగల్ సర్కిల్ ముఖ్య అటవీ సంరక్షణ అధికారి అక్బర్, జిల్లా అటవీ శాఖ అధికారి అర్పన తదితరులు పాల్గొన్నారు.

# లక్ష కోట్లకు ఐటీ ఎగుమతులు



తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ నాలుగేళ్లలోనే ఐటీ ఎగుమతులు రూ. లక్ష కోట్లకు చేరుకున్నాయని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం నిజామాబాద్ జిల్లా పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ ప్రసంగించారు. 2013-14లో తెలంగాణలో ఐటీ ఎగుమతులు రూ. 56వేల కోట్లు మాత్రమే అని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ ఎగుమతులను రూ. లక్షా 20 వేల కోట్లకు తీసుకుపోవాలని లక్ష్యం పెట్టుకున్నాం. ఈ సంవత్సరం వరకు రూ. లక్ష కోట్లకు చేరుకున్నాం. రాబోయే సంవత్సరం తమ లక్ష్యం నెరవేరుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. టీఎస్ఐపాస్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల ఉద్యోగాలు సృష్టించామని తెలిపారు. ఐటీని రాష్ట్ర రాజధానికి మాత్రమే పరిమితం చేయకుండా.. అన్ని జిల్లాలకు విస్తరిస్తున్నామని తెలిపారు. ద్వితీయ శ్రేణి పట్టణాలతో పాటు మారుమూల గ్రామాలకు ఐటీని విస్తరించాలనే సీఎం కేసీఆర్ సంకల్పంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లోని యువతీయువకులకు ఉద్యోగాలు కల్పించే దిశగా ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంతోనే ఐటీ కంపెనీలను జిల్లాలకు విస్తరిస్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు. నిజామాబాద్ కార్పొరేషన్‌కు ఈ నాలుగేళ్లలోనే రూ. 400 కోట్లు ఇచ్చామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, ఇతరత్రా గ్రాంట్లు కలుపుకుంటే మొత్తం రూ. 900 కోట్లు వచ్చాయని గుర్తు చేశారు. లక్షా 12 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ద్వారా 46 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తూనే.. మరోవైపు ప్రయివేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని కేటీఆర్ చెప్పారు.

# మరాఠాలతో దేవేంద్రుడికి చిక్కులే

విద్య, ఉద్యోగాల్లో గత కొద్దిరోజులుగా మారఠాలు చేస్తున్న ఆందోళనలు మహారాష్ట్రను కుదిపేస్తున్నాయి. మహారాష్ట్రలోని ముంబయి, థానే, పూనే ఇలా అన్ని ప్రాంతాల్లో ఈ రిజర్వేషన్ చిచ్చు రాజుకుంది. మరాఠా రిజర్వేషన్ల కోసం మరాఠా క్రాంతి మోర్చా పెద్దయెత్తున ఉద్యమాలను నిర్వహిస్తుంది. విద్య,ఉద్యోగాల్లో మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్నది వారి ప్రధాన డిమాండ్. ఈ సందర్భంగా పలువురు మారాఠా యువకులు రిజర్వేషన్లు కాంక్షిస్తూ ఆత్మబలిదానాలకు పాల్పడటంతో మరింత ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాని మరాఠా రిజర్వేషన్లు సాధ్యమేనా? సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఈ రిజర్వేషన్లు అమలుచేయడం అసాధ్యమని ప్రభుత్వమే ఒక పక్క అంగీకరిస్తుంది.కాని మరాఠాలు శాంతించడం లేదు. కన్పించిన ప్రభుత్వ, ప్రయివేటు వాహనాలను ధ్వంసం చేయడం, దహనంచేస్తుండటంతో మహారాష్ట్రలోని అనేక చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇక వచ్చేది ఎన్నికల సీజన్. లోక్ సభ , రాష్ట్ర ఎన్నికలు కూడా సమీపిస్తుండటంతో మరాఠాలు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి తమ డిమాండ్ ను నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్నారు. శివసేన వంటి పార్టీలు కూడా మరాఠాల ఉద్యమానికి మద్దతు పలికాయి. దీంతో రోజురోజుకూ ఉద్యమం తీవ్ర రూపందాలుస్తోంది. మరాఠాల ఉద్యమాలపై ప్రభుత్వం కూడా స్పందించింది. చర్చలకు ఆహ్వానించింది. అయినా ఉద్యమ వేడి చల్లారలేదు.మహారాష్ట్రలో మరాఠాలదే ఆధిపత్యం. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటములు నిర్ణయించే శక్తి మరాఠాలకు ఉంది. ఆర్థిక బలం వారికి పుష్కలంగా ఉంది. మహారాష్ట్ర జనాభాలో మూడో వంతు మంది ఉన్న మారాఠాలకు ప్రభుత్వం దిగిరాక తప్పదు. అయితే ఈసమస్యకు పరిష్కారం కష్టమేనంటున్నారు నిపుణులు. ఇప్పటికే మహారాష్ట్రలో యాభై శాతం రిజర్వేషన్లు అమలువుతున్నాయి. మరాఠాలు 16శాతం రిజర్వేషన్లు కోరుతున్నారు. ఓబీసీలో తమను చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఓబీసీలు మాత్రం ఇందుకు



అంగీకరించడం లేదు. బలమైన మరాఠాలను తమలో చేరిస్తే తాము బలహీన పడతామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆందోళనచేసినప్పుడు 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీరికి రిజర్వేషన్లను కల్పిస్తూ ఒక ఆర్డినెన్సును కూడా జారీ చేసింది. అయితే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాత్రం సంయమనం పాటిస్తున్నారు.తన చేతుల్లో లేదని, రిజర్వేషన్ల పెంపునకు సుప్రీంకోర్టు తీర్పు అంగీకరించదని ఒకవైపు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ చెబుతూనే ఉన్నారు. నిజానికి మరాఠాలు తొలినుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారు. అలాగే శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా మద్దతిస్తూవచ్చారు. గత ఎన్నికలలో మాత్రం మరాఠాలు అధికశాతం మోదీకి మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అంశం దేవేంద్ర ఫడ్నవిస్ కు చికాకును కల్గిస్తుంది. ప్రస్తుతానికి ఉద్యమాన్ని చల్లార్చేందుకు ఏదో ఒక ప్రకటనచేసినా అది తమకు మద్దతిచ్చే ఇతర సామాజిక వర్గాల పై పడి ఓటు బ్యాంకు దూరమవుతందని బీజేపీ భావిస్తోంది.

## చిన్నారికి డ్రైవింగ్... తండ్రికి లైసెన్సు రద్దు

తిరువనంతపురం ::వాహనాలతో రద్దీగా ఉండే రహదారిలో చిన్నారితో ద్విచక్ర వాహనం (స్కూటర్) నడిపించడం ఎంత ప్రమాదకరమో తెలుసా? కేరళకు చెందిన ఓ వ్యక్తి ఇదే చేశాడు. చివరికి పోలీసులు ఆగ్రహం చవిచూడక తప్పలేదు. పల్లురుతీకి చెందిన సిబు ఫ్రాన్సిస్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై అలువాకు బయల్దేరాడు. చిన్నారి బండి నడుపుతానని సరదా పడటంతో పూర్తిగా ఆమెకు హ్యాండిల్ ఇచ్చేశాడు. రద్దీగా ఉండే రహదారిలో ఆ చిన్నారి అంత వేగంగా ద్విచక్ర వాహనాన్ని నడపడం చూసిన వాహనదారులు ఆశ్చర్యపోయారు. కారులో వెళ్తున్న ఓ ప్రయాణికుడు అదంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అది వైరల్‌గా మారి పోలీసులకు చేరింది.

# గులాబీలో.. ఔషధ గుణాలెన్నో!



చూడగానే ఎంతో అందంగా కన్పించే గులాబీ పూలలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. అవి అందానికే కాదు ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. - గులాబీ రేకులను రోజూ గుప్పెడు తింటుంటే అవి శరీరంలోని దోషాలను పోగొడతాయి. దీనివల్ల రక్తశుద్ధి జరుగుతుంది. అంతేకాకుండా సహజంగానే వీటికి వీర్యవ ృద్ధిని కలిగించే గుణముంది. - యుక్త వయసులో హార్మోన్ల ప్రభావంతో మొహంపై వచ్చే మొటిమలు, నల్లమచ్చలను పోగొట్టడంలో గులాబీ రేకులు సమర్ధవంతంగా పనిచేస్తాయి. రేకులను నీటిలో బాగా మరిగించాలి. తర్వాత వాటిని బయటకు తీసి, ముద్దగా నూరాలి. దీనికి ముల్తానీ మట్టి కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో ఒక్కసారైనా మొహంపై రాసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. - గులాబీ రేకులతో తయారుచేసే కషాయమూ ఆరోగ్యానికి మంచిది. ఇది చర్మానికి మెరుపును అందిస్తుంది. దీనిని ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. కావాల్సిందల్లా గులాబీ రేకులు, నీరు మాత్రమే. - గులాబీ పూల నుంచి వచ్చే సువాసనను ఆస్వాదించడం వల్ల శారీరకంగానేకాక మానసికంగానూ ప్రశాంతత చేకూరుతుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి తోడ్పడుతుంది. వేడినీటిలో గులాబీ రేకులతో పాటు కొంత బాత్ సాల్ట్‌ని కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పద్ధతి ప్రకారం పీల్చితే తప్పకుండా ఉపశమనం లభించి, చురుగ్గా ఉంటారు. - గులాబీ రేకుల్లో ఉండే పదార్థాలు శరీరాన్ని నాజూకుగా ఉంచుతాయి. కొద్దిగా మెంతులు, గులాబీ రేకులు కలిపి చేసుకున్న పేస్టును తినాలి. లేకపోతే గులాబీ రేకులతో కాచిన కషాయాన్ని తాగినా సన్నబడతారు. గులాబీ రేకులు జీవక్రియను మెరుగుపరుస్తాయి.

## తొలిపలుకు సంపాదకీయం

### నదీ జలాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

గంగా, యమున, కృష్ణా, గోదావరి, కావేరి లాంటి జీవ నదులు దేశంలో వివిధ రాష్ట్రాల గుండా పయనిస్తూ ఎన్నో ఉపనదులను కలుపుకొని ఆయా పరివాహక ప్రాంతాలను సస్యశామలం చేస్తున్నాయి. వ్యవసా య ఆధారిత మనదేశంలో ఈ జీవనదులు భూముల్లో బంగారాన్ని పండిస్తాయి. ప్రజల తాగునీటి అవసరాలను తీరుస్తూ ప్రజలతో దేవతలుగా కొలువబడుతున్నాయి. అయితే ఈ నదులు ఆవిర్భవించిన చోటు నుంచి వివిధ రాష్ట్రాల గుండా ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తాయి. అయితే.. ఈ నదులు ప్రవహించే క్రమంలో ఎగువ రాష్ట్రాలకూ, దిగువ రాష్ట్రాలకూ అనివార్యంగా కొన్ని వివాదాలు తలెత్తుతున్నాయి. ఈక్రమంలోనే దేశంలో అనేక చోట్ల, పలు రాష్ట్రాల్లో జలవివాదాలు అంతర్‌రాష్ట్ర జలవివాదా ల పేరుతో జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా నదీ ప్రవాహ క్రమం లో ఎగువన ఉన్న ప్రాంతంలోని ప్రజలు తమ సాగునీటి అవసరాల కోసం నదీ జలాలను అవసరమున్నంత మేర వాడుకోవాలని చూసే క్రమంలోనే అసలు సమస్యలు తలెత్తుతున్నాయి. సాధారణంగా ఎగు వ రాష్ట్రాలు నదీ జలాలు వాడకానికి ప్రాజెక్టులు నిర్మించి, రిజర్వాయర్‌లు నిర్మించి వాటిని నీటితో నింపి నిలువు చేసుకుంటాయి. దీంతో దిగువ ప్రాంతాలకు సహజంగా ప్రవహించే నీటి పరిమాణంలో తగ్గుదల ఉంటున్నది. ఎగువ రాష్ట్రం వాడుకుని మిగిలిన జలాలను దిగువ ప్రాంతాలకు విడిచినవే మిగులుజలాలు. ఈమిగులు జలాలను వాడుకోవడంలో కూడా దిగువ ప్రాంతాలకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో నీటిని నిలువ ఉంచడం వల్ల నీటిలో లవణాల శాతం పెరిగిపోతున్నది. వ్యర్థ పదార్థాలు పేరుకుని పోవడం తోపాటు రంగు కూడా మారిపోతున్నది.అన్నింటి కన్నా ముఖ్యమైన సమస్య ఏంటంటే.. కాలువల ద్వారా నిర్దేశిత ప్రాంతానికి చేరేలోగానే న్యాయంగా చేరాల్సిన నీటి వాటా కన్నా చాలా తక్కువ చేరుతున్నది.కాలువల ద్వారా ప్రవహించే క్రమంలో భూమిలో ఇంకిపోవడం, ఆవిరి అయిపోవడం ద్వారా నీటి పరిమాణంలో చాలా వరకు తరుగుదల ఉ ంటున్నది. కాబట్టి ఎగువ ప్రాంతాలతో పోలిస్తే.., దిగువ ప్రాంతాలకు నీరు అందుతున్న నీటిలో తరుగుదల ఉండటంతో తరచుగా వివాదాలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చిందే ఆల్మట్టి వివాదం. తమ అవసరాల కోసం తమ ప్రాంతంలో ప్రవహిస్తున్న నదిపై ఉన్న ప్రాజెక్టు ఎత్తు పెంచామని కర్ణాటక అంటే.., తమ ప్రాంతానికి రావలసిన నీటి వాటాలో కర్ణాట క జలచౌర్యానికి పాల్పడుతున్నదని దిగువ రాష్ట్రం వాదనకు దిగింది. ఇలాంటివే ఎన్నో జల వివాదాలు దేశంలో నిత్యం రాజుకుంటూనే ఉ న్నాయి. ఈ జలవివాదాలను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం 1956లో అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం రూపొందించింది. ఇది సమాఖ్య స్ఫూర్తికి అనుగుణంగా రూపొందించబడింది. ఈ చట్టం ప్రకారం ఏ నదీ పరివాహక ప్రాంతంలోనైనా నీటి పంపకాలు, నది జలాలపై అధికారం విషయంలోనూ, మిగులు జలాల విషయంలోనూ తలెత్తే వివాదాలను పరిష్కరిస్తారు. ఎక్కడైనా నదీజలాల విషయంలో తలెత్తిన వివాదాలను పరిష్కరించేందుకు కేంద్రం ఈ చట్టం ద్వారా ముందుకు పోతున్నది.

# కరుడుగట్టిన దళిత వ్యతిరేకత



ఓ వైపు ఎస్సీ ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేస్తూ మరోవైపు ఏమీ ఎరగనట్టు 'సామాజిక న్యాయ పక్షోత్సవాలు' (ఆగస్టు 15-30) జరపాల్సిందిగా బిజెపి ఎంపీలను కోరడం నరేంద్ర మోడీ మార్కు ద్వంద్వనీతికి నిదర్శనం. ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పై సుప్రీంకోర్టు బెంచి మార్చి 20న ఇచ్చిన తీర్పు దేశవ్యాప్త నిరసనలకు దారి తీసింది. నిందితులకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి వీలు లేకుండా ఆ చట్టంలో పొందు పరిచిన సవరణను నిర్వీర్యం చేసింది సుప్రీం తీర్పు. ఈ తీర్పు పట్ల కేంద్ర ప్రభుత్వం ఎటువంటి అభ్యంతరాన్ని చెప్పలేదు. అంటే మోడీ ప్రభుత్వం ఆ తీర్పును పరోక్షంగా స్వాగతించినట్టే భావించాలి. పైగా ఆ తీర్పునిచ్చిన సుప్రీం న్యాయమూర్తి ఎ.కె.గోయెల్‌ను పదవీ విరమణ అనంతరం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా నియమించారంటే ఆ భావ సారూప్యత స్పష్టం అవుతూనే ఉంది. సుప్రీం తీర్పు వెలువడ్డాక దేశమంతటా నిరసనలు, బంద్‌లు జరిగి కొందరు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. అయినా గోయెల్‌కు గ్రీన్ ట్రిబ్యునల్ పదవిని కట్టబెట్టారు. పైకి అంబేద్కర్ నామ జపం చేసినా, ఒక దళితుడిని దేశాధ్యక్షుడిగా ఎంచుకున్నా, బిజెపి హిందుత్వ మనువాద స్వభావం ఎప్పటికప్పుడు వెల్లడి అవుతూనే వుంది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ/ఎస్టీ చట్టానికి తిరిగి బలాన్ని చేకూరుస్తూ బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బిల్లు ప్రజా ఉద్యమ ప్రభావం వల్లనే సాధ్య పడింది తప్ప బిజెపి వైఖరిలో మార్పు వలన కాదు. పులి చారలు మాసిపోవు కదా! దళిత ఉద్యమాలు, వామపక్ష పార్టీలు సుప్రీం తీర్పు వెలువడ్డాక దానిపై స్పందిస్తూ ఇలా పదే పదే కోర్టుల్లో ఆ చట్టం పటిష్టతను దెబ్బ తీయకుండా దానిని రాజ్యాంగపు తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఐతే మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన చట్ట సవరణలో ఆ ప్రస్తావనే లేదు. 1989లో మొదటిసారి ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక బిల్లును ప్రతిపాదించారు. ఆ బిల్లులో పేర్కొన్న లక్ష్యాల ప్రకటనలో ఇలా ఉంది. 'దళితులు, గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదల కోసం పలు చర్యలు చేపట్టినప్పటికీ, వారికింకా దాడులకు గురవుతూనే ఉన్నారు. అనేక పౌర హక్కులను వారు పొందలేక పోతున్నారు. వారి పైన పలు విధాల దాడులు జరుగుతున్నాయి. వారెన్నో రకాల అవమానాలను ఎదుర్కొంటున్నారు. వేధింపులకు, అవహేళనలకు గురవుతున్నారు. పలు క్రూరమైన దాడులలో ఆస్తులను, ప్రాణాలను కోల్పోతున్నారు. అనేక చారిత్రక, సామాజిక, ఆర్థిక కారణాల వలన వారిపై చాలా తీవ్రమైన నేరాలు కొనసాగుతున్నాయి'. 2013లో ఈ చట్టానికి సవరణ తెస్తూ ప్రతిపాదించిన బిల్లు లక్ష్యాల ప్రకటనలో ఇలా ఉంది. 'అత్యాచారాలను నిరోధించడానికి అనేక కఠినమైన చర్యలను ఈ చట్టంలో పొందుపరిచినప్పటికీ దళితుల పైన, గిరిజనుల పైన అత్యాచారాలు నేటికీ చాలా ఆందోళనకరమైన స్థాయిలో కొనసాగుతూనే ఉన్నాయి. మెజారిటీ బాధితులు, సాక్షులు తగిన రక్షణను గాని, న్యాయాన్ని గాని పొందలేక పోతున్నారు. న్యాయ ప్రక్రియ లోని వివిధ దశలన్నింటిలోనూ వారు తీవ్ర అవరోధాలను ఎదుర్కొంటున్నారు. (1) కేసులను ఈ చట్టం లోని సెక్షన్ల కింద నమోదు చేయకపోవడం. (2) ఫిర్యాదుపై తగిన విచారణ చేయడంలో గాని, అరెస్టు చేయడంలో గాని, చార్జిషీటు దాఖలు చేయడంలో గాని తీవ్ర జాప్యం జరగడం. (ఇ) విచారణలో జాప్యం, చాలా తక్కువ సందర్భాలలో మాత్రమే దోషులకు శిక్షలు పడడం-ఈ కారణాల వలన ఈ చట్టం అమలు బలహీనంగా ఉ ంది'. ఈ బలహీనతలను అధిగమించడానికి 2013 చట్ట సవరణ జరిగింది. నిర్దిష్ట వ్యవధి లోపు కేసుల నమోదు, చార్జిషీటు దాఖలు వంటి నిబంధనలు అదనంగా వచ్చాయి. ముద్దాయిలకు ముందస్తు బెయిల్ దొరకదు. ఇలా కఠినతరం చేసిన తర్వాత కూడా దళితుల పైన, గిరిజనుల పైన అత్యాచారాలు పెరుగుతూనే ఉ న్నాయి. దోషులకు ప్రభుత్వ యంత్రాంగం నుంచి బాహాటంగానే మద్దతు లభిస్తోంది. ప్రతి 15 నిమిషాలకూ దళితులపై ఏదో ఒక దాడి జరుగుతోంది. ప్రతి రోజూ సగటున ఆరుగురు దళిత మహిళలు మానభంగాలకు గురవుతున్నారు. 2007-2017 మధ్య దళితులపై సాగిన నేరాల సంఖ్య 66 శాతం పెరిగింది. ఇదంతా నమోదయిన ఫిర్యాదుల ప్రాతిపదికన తేలిన లెక్కలు. అగ్ర వర్ణాలకే పోలీసులు హెచ్చు సందర్భాలలో కొమ్ము కాయడం, పెత్తందారీ శక్తులు ప్రతీకార దాడులకు పూనుకుంటాయన్న భయం, న్యాయ ప్రక్రియలో జరిగే విపరీతమైన జాప్యం, వీటన్నింటి కారణంగా అనేక అత్యాచార ఘటనలపై ఫిర్యాదు చేయడానికి కూడా దళిత, గిరిజనులు ముందుకు రావడం లేదు. జరిగిన సంఘటలన్నింటిని గనుక ఫిర్యాదులుగా రికార్డు చేయగలిగితే అత్యాచారాలు ఎంత పెద్ద మోతాదులో పెరుగుతున్నాయో అర్థమవుతుంది.జాతీయ స్థాయిలో దళితులపై అత్యాచార కేసుల్లో దోషులకు శిక్షలు పడినవి 28.4 శాతం. అదే గుజరాత్ లోనైతే ఇది కేవలం 3.4 శాతమే. అదే గిరిజనులపై అత్యాచార కేసుల్లో 37.9 శాతం దోషులకు శిక్షలు జాతీయ స్థాయిలో పడుతుంటే గుజరాత్‌లో మాత్రం అది 1.8 శాతమే. ఇటువంటి చేదు అనుభవాలను చవిచూశాక ఈ చట్టాన్ని మరింత పటిష్టం చేయడం ఎలా అన్నది చూడాల్సింది పోయి దానిని బలహీన పరిచేలా తీర్పు ఇవ్వడం ఎంత ఘోర అన్యాయం! ఈ తీర్పుపై జరిగిన ఆందోళనల సందర్భంగానూ పోలీసులు తమ పచ్చి దళిత వ్యతిరేకతనే ప్రదర్శించారు. ఏప్రిల్ బంద్ సందర్భంగా 9 మంది చనిపోయారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం లోని పోలీసులు ఘజియాబాద్‌లో దళితులు లూటీలకు, హింసాకాండకు పాల్పడ్డారని ఆరోపిస్తూ 295 మంది మీద 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 85 సంవత్సరాల వయోవృద్ధుడు శ్రీరామ్ హితేషి, ఒక స్కూలు నిర్వహిస్తున్నాడు. ఆయనపై పోలీసులు హత్యా యత్నం కేసు పెట్టారు. మూడు సంవత్సరాలుగా క్షయ వ్యాధితో బాధపడుతూ వైద్యం కోసం రోజూ ఆస్పత్రికి పోతున్న సంజరు సింగ్ పైనా కేసు బనాయించారు. ఒక పక్క ఓట్లు కావాల్సి వచ్చినప్పుడు దళితులపై అపారమైన ప్రేమను ఒలకబోస్తూనే ఇంకో పక్క వారిపై దాడులను ముమ్మరం చేయడం పాలక వర్గాల దమన నీతి. కేవలం చట్టాలలో మార్పు కోసమో, రిజర్వేషన్ల అమలు కోసమో మాత్రమే మన పోరాటాన్ని పరిమితం చేస్తే ఈ దమన నీతిని ఓడించలేం. సమాజంలో కుల నిర్మూలన జరగాలని, కుల వివక్ష పోవాలని కోరుకునే అభ్యుదయ వాదులంతా ఏకమై తీవ్ర స్థాయిలో మౌలిక మార్పుల కోసం ఉద్యమించాల్సిన తరుణమిది.

## కరివేపాకును తీసిపారెయ్యకండి!

చాలామంది కరివేపాకు కేవలం కమ్మదనం కోసమే వాడతారని అపోహ పడుతుంటారు. వాస్తవానికి సహజ సువాసనలు కలిగిన కరివేపాకులో అద్భుతమైన ఔషధ గుణాలూ ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. భోజనం చేసేటప్పుడు కరివేపాకు తినకుండా పక్కన పడేస్తుంటాం. కరివేపాకులో ఏముంటుందిలే అని పక్కన పెట్టేస్తే..దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలకు దూరమైనట్టే! అలాకాకుండా కరివేపాకును ఏదో ఒకరూపంలో..ఆహారంలో భాగంగా చేసుకుంటే అన్నివిధాలా ప్రయోజనం. కరివేపాకుతో సమకూరే లాభాలు తెలుసుకుంటే..కరివేపాకును చూసిన ప్రతిసారీ తినాలనిపిస్తుంది.



- కరివేపాకు అజీర్ణాన్ని పోగొట్టి ఆకలిని పెంచుతుంది. జీర్ణాశయ సమస్యలను నియంత్రించడంతో పాటు విరోచనాలను తగ్గిస్తుంది.
- పేగులు, పొట్ట కండరాలను బలోపేతం చేస్తుంది.
- శరీరంలోని అనవసరమైన కొవ్వును తగ్గిస్తుంది.
- కరివేపాకులోని లాక్సేటివ్ లక్షణాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి.
- డయేరియాను నయం చేస్తుంది. ఫుడ్ పాయిజనింగ్ నుంచి కాపాడుతుంది.
- చెమట ఎక్కువగా పట్టడం, చెమటలో దుర్వాసన లక్షణాలను పూర్తిగా నివారిస్తుంది.
- న్యుమోనియా, ఫ్లూ వంటి అనారోగ్య పరిస్థితుల నుంచి కాపాడే గొప్ప ఔషధం కరివేపాకు.
- మధుమేహం, రక్తపోటు రుగ్మతలను తగ్గిస్తుంది.
- క్యాన్సర్ ప్రేరేపిత కారకాలను నియంత్రిస్తుంది.
- కరివేపాకులో ఉండే కార్బోజోల్ ఆల్కలాయిడ్ యాంటీ ఆక్సిడెంట్ శరీరంలో ఫ్రీరాడికల్స్‌ను నివారిస్తుంది. ఇన్ఫెక్షన్లకు గురి చేస్తున్న బ్యాక్టీరియాను నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. - శరీరానికి మంచి రంగును కాంతిని అందిస్తుంది. కార్బోహైడ్రేట్స్, ఫైబర్, క్యాల్షియం, ఫాస్పరస్, ఇనుము, మెగ్నీషియం, రాగి, ఖనిజాలు, కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఈతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్, ప్లాస్టీ స్టెరాల్స్, అమైనో ఆమ్లాలు,

# అణ్వస్త్రాలు నాడు-నేడు

తన యుద్ధ వ్యూహంలో భాగంగా ఈ భూమ్మీద తొలి సారి పౌర ఆవాసాల మీద అణుబాంబులు ప్రయోగించిన అమెరికా నేటికీ అదే దుర్మార్గ వైఖరిని అనుసరిస్తోంది. 1945 ఆగస్టు 6న అమెరికా ప్రయోగించిన 'చిన్న' అణుబాంబు (లిటిల్ బాయ్) జపాన్ లోని హిరోషిమా నగరాన్ని నేలమట్టం చేసింది. 1.4 లక్షల మంది నగర వాసులు చనిపోయారు. హిరోషిమా పట్టణ జనాభా అప్పుడు 3.1 లక్షలు. అంటే జనాభాలో దాదాపు సగం మంది బాంబు పడిన వెంటనేగాని, నాలుగు మాసాల లోపుగాని చనిపోయారు. బతికిన వారు కూడా క్యాన్సర్, ల్యూకేమియా వంటి భయంకర వ్యాధులతో అనేక సంవత్సరాలు బాధపడ్డారు. వారి సంతానం కూడా అంగవైకల్యాలతో పుట్టారు. హిరోషిమా అణు విలయం తరువాత మరో మూడు రోజులకే 1945 ఆగస్టు 9న జపాన్ లోని మరో నగరం నాగసాకిపై అమెరికా ప్రయోగించిన కొంచెం 'పెద్ద' అణుబాంబు (ఫాట్ మ్యాన్) కూడా దాదాపు అంతే విధ్వంసం సృష్టించింది. అప్పటికి ఆ పట్టణ జనాభా 2.5 లక్షలు. అందులో దాదాపు 90,000 మంది, అంటే జనాభాలో మూడో వంతుకు పైగా చనిపోయారు. అణు విలయం ఎలా వుంటుందో ఈ నగరాలు ప్రపంచానికి చాటి చెప్పాయి. చరిత్రలో క్షమించరాని ఈ దుర్మార్గానికి పాల్పడిన రాజ్యం అమెరికా తరువాత ప్రపంచంలో అణ్వస్త్ర పోటీకీ, అణ్వస్త్రాల వ్యాప్తికి కారణమైంది. 1991లో అమెరికా, రష్యన్ ఫెడరేషన్‌ల మధ్య కుదిరిన 'స్టార్ట్' (వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం) వల్ల రెండు దేశాలు తమ అణ్వాయుధాలను గణనీయంగా తగ్గించుకు న్నాయి. 2010లో బరాక్ ఒబామా హయాంలో కుదిరిన సరికొత్త 'స్టార్ట్' ఒప్పందం మరిన్ని అణ్వాయుధాల తగ్గింపుకు మార్గం సుగమం చేసింది. కానీ అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టాక ఆ ఒప్పందాన్ని తెగనాడడం ప్రారంభించాడు. ఒప్పందం వల్ల అమెరికాకు నష్టం జరుగుతోంది గనుక దాన్ని ఉపసంహరించుకోవాలని ప్రకటించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్ ప్రభుత్వం విడుదల చేసిన 'అణు వైఖరి సమీక్ష నివేదిక'తో మళ్లీ ప్రపంచ వ్యాపితంగా అణ్వస్త్ర పోటీకి శ్రీకారం చుట్టాడు. 'మనం కళ్లెదుట కనబడుతున్న వాస్తవాన్ని చూడాలి. ప్రపంచాన్ని మనకు తోచిన విధంగా కాకుండా ఉన్నదున్నట్లు చూడాలి' అని అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మాట్టిస్ పేర్కొన్నాడు. ఈ వాస్తవ పరిస్థితులను బట్టి అమెరికా ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో మాదిరిగా తిరిగి త్రివిధ అణ్వస్త్రాలకు మళ్లాలి. కొత్త ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, కొత్త దీర్ఘ శ్రేణి బాంబర్ విమానాలు, కొత్త బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములు తయారు చేయాలి. దీంతో బాటు గతంలో చాలా ప్రమాదకరమైనవని జార్జి బుష్ 1991లో సర్వీస్ నుండి తొలగించిన తక్కువ శక్తినిచ్చే 'టాక్టికల్' అణుబాంబులను తయారు చేయాలి. వీటి తయారు కోసం లక్ష కోట్ల డాలర్ల బడ్జెట్ కేటాయించాలని అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ ప్రభుత్వాన్ని కోరింది. నాడు జపాన్‌ను బూచిగా చూపించి హిరోషిమా, నాగసాకి బాంబుల ప్రయోగానికి పాల్పడిన అమెరికా తరువాత సోవియట్ బూచిని చూపించి అణ్వస్త్రాలను వ్యాపింప జేసింది.

నాటి నుండి నేటివరకూ 'అణు శక్తి' అనేది- అది బాంబుల రూపంలో వున్నా, అణు రియాక్టర్ల రూపంలో వున్నా- అమెరికా సైనిక వ్యూహంలో భాగంగానే వుంది. అమెరికా అణు వ్యూహమే ప్రపంచాన్ని అణు ప్రమాదం లోకి నెట్టింది. ఆ వ్యూహమే నేటికీ ప్రపంచం లోని అనేక ప్రాంతాల్లో అణు విస్ఫోటనాలకూ, అణు ఉద్రిక్తతలకూ కారణమవుతోంది. తొలి అణుబాంబు ప్రయోగం జరిగిన తరువాత గడచిన ఆరు దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే మనకు ఈ విషయం బోధపడుతుంది. అణ్వస్త్ర రంగంలో ముందుగా ప్రవేశించిన అయిదు అగ్ర దేశాలు-అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా-ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం కలిగి న్నాయి. 'తాము ముందుగా ఇతర దేశాలపై అణు బాంబులు ప్రయోగించబోము' అని రష్యా (నాటి సోవియట్ యూనియన్), చైనాలు ప్రకటించాయి. అమెరికా అటువంటి కట్టుబాటు ప్రకటన నేటికీ చేయలేదు. అంటే ఇప్పటికీ అమెరికా యుద్ధ వ్యూహంలో అణుబాంబులు రక్షణ కోసం కాకుండా ఇతర దేశాలపై దాడి కోసమే వున్నాయి.

జపాన్, దక్షిణ కొరియాల్లో అమెరికా మోహరించిన అణు బాంబులు తమ దేశానికి ప్రమాదకరంగా తయారైనాయి గనుక ఉత్తర కొరియా ఆత్మరక్షణ కోసం అణు కార్యక్రమం ప్రారంభించింది. దానిపై అమెరికా చేస్తున్న రభస జగమెరిగిందే. ఇరాన్ అణు కార్యక్రమంపై గగ్గోలు పెడుతున్న అమెరికా ఇతర పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్ దగ్గర పేరుకు పోతున్న అణ్వస్త్రాల గురించి మాత్రం మాట్లాడవు. ఇక భారత దేశం విషయానికి వస్తే ఇటీవలి కాలం వరకు మన పాలకులు అణు రంగంలో స్వతంత్ర వైఖరినీ, సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరినీ ప్రదర్శిస్తూ వచ్చారు. వేలాది అణ్వస్త్రాలను గుప్పెట్లో పెట్టుకుని వాటి గురించి మాట్లాడకుండా ఇతర దేశాలు మాత్రం అణ్వస్త్రాలు తయారు చేయకూడదని చెబుతున్న 'అణు అగ్ర రాజ్యాల' వైఖరిని భారత్ వ్యతిరేకిస్తూ వచ్చింది. 1974 పోఖ్రాన్ అణు పరీక్షల తరువాత అణ్వస్త్ర సామర్థ్యం వున్నప్పటికీ అణ్వస్త్రాలు మాత్రం తయారు చేయబోమని భారత్ ప్రకటించింది. అందువల్ల అగ్ర రాజ్య కౌటిల్యానికి మారు పేరుగా మారిన అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి) మీద సంతకం కూడా చేయబోనని ప్రకటించింది. అగ్ర రాజ్యాలన్నీ అణ్వస్త్రాలు నిర్మూలి స్తామని ప్రకటించాలని, దానికోసం ఒక కాలమాన కార్యక్రమం ప్రకటించాలని డిమాండ్ చేసింది. ఈ వైఖరి భారత్‌ను అంతర్జాతీయ రంగంలో ఒక ప్రతిష్ఠాత్మక స్థితిలో నిలిపింది. కాని కేంద్రంలో మొదటిసారి అధికారం లోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, తరువాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వైఖరికి తిలోదకాలిచ్చాయి. బిజెపి ప్రభుత్వం మరోసారి అణు పరీక్షలు చేసి, అణ్వస్త్ర నిల్వలకు పూనుకుంది. దాంతో మన అణు కార్యక్రమాలపై అంతర్జాతీయ ఆంక్షలు మరింత తీవ్రమైనాయి. ఈ ఆంక్షల నేపథ్యంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం అమెరికా ముందు పూర్తి లొంగుబాటు ప్రకటించింది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంలోని షరతులన్నిటితో కూడిన 123 ఒప్పందంపై మన్మోహన్ సంతకాలు చేయడంతో భారత అణు కార్యక్రమం అమెరికా చెప్పుచేతల్లోకి వెళ్లింది. మన్మోహన్ ప్రభుత్వం అమెరికా ముందు మోకరిల్లితే ప్రస్తుత మోడీ ప్రభుత్వం దానికి సాష్టాంగ ప్రణామం చేస్తోంది. అమెరికా ప్రారంభించిన అణ్వస్త్ర పోటీ నేడు ప్రపంచాన్ని మహా అణు విపత్తు అంచున నిలిపింది. నేడు ప్రపంచంలో సుమారు 16,000 అణు బాంబులు ప్రయోగానికి సిద్ధంగా వున్నాయని అంచనా. ఇంకా తయారీకి సిద్ధంగా వున్న బాంబులు దీనికి అనేక రెట్లు ఎక్కువ. ఈ బాంబుల్లో అమెరికా, రష్యాల వద్దే అత్యధికం అంటే సుమారు 15,000 ఉన్నాయి. మిగిలిన దేశాలన్నీ టివద్దా సుమారు 1000 అణ్వస్త్రాలున్నాయి.

హిరోషిమా బాంబు 1.4 లక్షల మందిని పొట్టనబెట్టుకుంది. కాని నేడు ప్రపంచంలో నిల్వ వున్న అణుబాంబులన్నీ పేలితే 700 కోట్ల జనాభా ఒక సారి కాదు రెండు సార్లు కాదు, 500 సార్లు చనిపోతారు. హిరోషిమా వైశాల్యం 905 చదరపు కిలోమీటర్లు. 12 కిలో టన్నుల చిన్న అణు బాంబు దాన్ని పూర్తిగా ధ్వంసం చేసింది. ఈ లెక్కన నేడు భూమ్మీద వున్న అణు బాంబులన్నీ పేలితే ప్రపంచం ఒకసారి కాదు రెండు సార్లు కాదు వందల సార్లు భస్మీపటలం అవుతుంది.




ఇంతటి విధ్వంసక శక్తిని సృష్టించిందీ, తొలిగా ప్రయోగించిందీ, ప్రపంచమంతటా విస్తరించిందీ అమెరికా. సకల దేశాల అణ్వస్త్ర కార్యక్రమాలకూ ప్రత్యక్షంగా, పరోక్షంగా అమెరికా కారణమవు తోంది. అణు పరిజ్ఞానాన్ని చేతిలో పెట్టుకుని అమెరికా చేస్తున్న అణు బ్లాక్‌మెయిల్ మాత్రం అంతా ఇంతా కాదు. తన ప్రయోజనాలు నెరవేర్చే దేశాలకు అణ్వస్త్ర రక్షణ కవచం కల్పిస్తున్న అమెరికా తనకు గిట్టని దేశాలపై దాడులకు కూడా ఈ అణ్వస్త్రాలు అనే సాకునే ఉపయోగించు కుంటోంది. ఇరాక్‌పై దాడికి దీన్నే సాకుగా ఉపయోగించుకుంది.

ఇరాన్‌పై నేడు ఈ సాకుతోనే కాలు దువ్వుతోంది. యూరప్‌తో కలిసి ఇరాన్‌తో కుదుర్చుకున్న అణు ఒప్పందం నుండి ట్రంప్ ప్రభుత్వం ఏకపక్షంగా వైదొలగి ఆ దేశంపై అనేక ఆంక్షలు విధిస్తూ కక్ష సాధిస్తోంది. ఉత్తర కొరియా, ఇరాన్ ఒకటేమిటి తన మాట విననిదేశాలను బెదించడానికి అమెరికా అణ్వస్త్ర కార్యక్రమం అనేదాన్ని ఒక పావుగా వాడుకుం టోంది. భారత్‌ను కూడా తన అంతర్జాతీయ యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా మార్చుకో దానికి అణు ఒప్పందాన్ని పావుగా వాడుకుంటున్న వైనం మనకు తెలుసు. అందువల్ల అన్ని విధాలా నేడు ప్రపంచానికి అణు ప్రమాదం అమెరికా నుండే వస్తున్నది. హిరోషిమా, నాగసాకి మృతులను తలచుకుని విచారపడే ఈ సమయంలో ఆ విలయానికి కారణమైన అమెరికా దుర్మార్గాన్ని మరిచిపో కూడదు. ప్రపంచ వ్యాపితంగా అణ్వస్త్ర వ్యాప్తికి కారణమైన సామ్రాజ్యవాద రక్త చరిత్రను చెరిపేయ కూడదు. అమెరికా అణు విధానాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడమే హిరోషిమా, నాగసాకి మృతులకు సమర్పించే నిజమైన నివాళి.

# షెల్టర్ హోమ్‌లో కీచక పర్వం

బీహార్‌లోని ముజఫర్‌పూర్ షెల్టర్ హోమ్‌లో 34 మంది మానసిక వికలాంగులైన బాలికలను చెరచిన ఘటన సభ్య సమాజానికే సిగ్గుచేటు. అనాథలను చేరదీసి, ఊరట కల్పించాల్సిన ఆశ్రమాలు వారి పాలిట నరక కూపాలుగా మారడం బీహార్‌లో ఆటవిక సంస్కృతికి దర్పణం పడుతున్నది. ముజఫర్‌పూర్ హోమ్‌లో గత కొన్నేళ్లుగా సాగుతున్న నిరాఘాటంగా సాగిపోతున్న కీచక పర్వాన్ని టాటా సామాజిక అధ్యయనాల సంస్థ(టిస్) క్షేత్ర స్థాయి ప్రాజెక్టు 'కోశిష్' నివేదిక వెల్లడించే దాకా ఈ దారుణ అకృత్యాల గురించి బయట ప్రపంచానికి తెలియరాలేదంటే ఇది ఎంత పకడ్బందీగా సాగినదీ, దీని వెనక ఎంత పెద్ద నెట్‌వర్కు ఉన్నదీ విదితమవుతోంది. బీహార్‌ను పట్టి కుదిపేస్తున్న ఈ భారీ సెక్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు, రాజకీయ బ్రోకర్ బ్రజేష్ ఠాకూర్ పరారీలో ఉండడం, ఈ కేసులో కీలక పాత్రధారిగా భావిస్తున్న మరో వ్యక్తి, బీహార్ మంత్రి మంజు వర్మ భర్త అయిన చందేశ్వరి వర్మ పేరును ఎఫ్‌ఐఆర్ నుంచి తప్పించడం ఈ కేసులో దర్యాప్తు విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అత్యాచార కేసులో నిందితులను కాపాడేందుకు బీహార్‌లో జెడి(యు)-బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న ప్రతిపక్షాల ఆరోపణలకు ఇవి మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. గత ఏడాది బీహార్‌లో హోమ్‌లన్నిటినీ పరిశీలించి భయానకమైన వాస్తవాలను వెలికి తీసిన టిస్‌ను మొదట అభినందించాలి. టిస్ ఏప్రిల్‌లో ప్రభుత్వానికి నివేదిక ఇస్తే, తీరికగా మే 31న సాంఘిక సంక్షేమ శాఖ దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల దర్యాప్తుతో మమ అనిపించాలని చూసింది. దీనిపై సిబిఐ దర్యాప్తు అవసరం లేదని, పోలీసుల దర్యాప్తు చాలు అని డిజిపి ద్వివేదితో మొదట చెప్పించింది. దీనిపై ప్రతిపక్షాల ఆందోళనలు, బీహార్ బంద్, జంతర్ మంతర్ వద్ద వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాల భారీ ధర్నా , బీహార్ అసెంబ్లీ, పార్లమెంటులో పెద్దయెత్తున దుమారం రేగడం, సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయడంతో సిబిఐకి ఈ కేసును అప్పగించారు. దాదాపు మూడు వారాలుగా దీనిపై దేశం గగ్గోలు పెడుతున్నా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడకపోవడం విస్తు గొలుపుతోంది. ఎన్నికల ముందు బేటీ బచావో అన్న మోడీ నినాదం రివర్స్ అయి బిజెపి నుంచి బేటీ బచావో అని నినదించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ కేసును మసిపూసి మారేడుకాయ చేసేందుకు బీహార్‌లోని నితీష్ ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికీ యత్నిస్తున్నాయి. ఈ కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు బ్రజేష్ ఠాకూర్‌తో బీహార్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి భర్త చందేశ్వర్ వర్మ సాగించిన ఫోన్ సంభాషణల టేపులు వెలుగులోకి వచ్చాక కూడా ఆయనను అరెస్టు చేసేందుకు నితీష్ ప్రభుత్వం సిద్ధం కావడం లేదు. మంత్రి మంజు వర్మను తొలగించాలని అన్ని వైపుల నుంచి ఒత్తిడి వస్తున్నా ఆమెను మంత్రివర్గంలో కొనసాగిస్తుండడం జెడియు- బిజెపి భ్రష్టాచార రాజకీయాలను తెలియజేస్తున్నది. బాధితులను కలిసిన రాష్ట్ర మహిళా కమిషన్ వెల్లడించిన వివరాలు బీహార్‌లో బాలికల పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదీ తేటతెల్లం జేస్తున్నాయి. షెల్టర్ హోమ్‌ను తరచూ సందర్శించిన హోమ్ మంత్రి భర్త , ఆయనకు తోడుగా హోమ్ ఆవరణలోనే చిన్న పత్రికా కార్యాలయాన్ని తెరచిన పవర్ బ్రోకర్ బ్రజేష్ ఠాకూర్ బాలికలకు మాదక ద్రవ్యాలిచ్చి లైంగిక బానిసలుగా మార్చుకున్న తీరు ఊహించుకుంటేనే భయమేస్తుంది.

# హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ విధానం




సాంకేతిక విప్లవంతో విశ్వమే ఓ కుగ్రామంగా మారి పోయింది. అందుబాటులోకి వచ్చిన అత్యాధుని క సాంకేతికతతో ప్రభుత్వ పాలనా విధానం సైతం సంస్కరణల బాటపట్టింది. జిల్లా స్థాయిలో ఓ పనికి సంబంధించిన ఫైళ్లు జూనియర్ అసిస్టెంట్ నుంచి సర్కులేట్ అయితే అది కలెక్టర్ వద్దకు చేరేవరకు నెలలు పట్టింది. కానీ అందివచ్చిన టెక్నాలజీ కారణంగా పూర్తిగా కంప్యూటర్ కాలంగా మారిన నేడు నిమి షాల్లోనే పని పూర్తివుతుంది. అలాంటి టెక్నాలజీని పరిపాలనకు జోడించి ప్రజల సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించడంతో పాటు వారికి పార దర్శకంగా సేవలను అందించడమే లక్ష్యంగా కలెక్టరే ట్‌లో సంపూర్ణంగా ఈ -ఆఫీస్ విధానం అమలు కానుంది. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని గతంలో జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన రాహుల్ బొజ్జా 2016 అక్టోబర్ 1వ తేదీన జిల్లాలో ఈ- ఆఫీస్ ప్రొగ్రాంను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అదే రోజు నుంచి కలెక్టరేట్‌లో ఈ ఆఫీస్ విధానం ద్వారానే కార్యకలపాలను చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఇందుకు అనుగుణంగా కొంత మేర కసరత్తు సైతం జరిగింది. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో 2016 సెప్టెంబర్ 30 నాటికి 15 వేల ఫైళ్లు ఉండగా 15 లక్షల కాఫీలు ఉన్నాయన్నారు. వీటిని డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టడం జరిగిందని ఇప్పటికీ 4500 ఫైళ్లకు సంబంధించిన 5 లక్షల కాఫీలను స్కానింగ్ చేసి కంప్యూటర్లలో భద్రపర్చారు. కాని అధికారులు అలసత్వం, ఉన్నతాధికారులు పర్యావేక్షణ లోపం కా రణగా అయితే గడిచిన 22 నెలలుగా ఎప్పటీ కప్పుడు వాయిదా ఈ ఆఫీసు విధానం వాయిదా పడుతూ వచ్చింది. రాహుల్ బొజ్జా తర్వాత గత ఏడాది అగస్టు 17న జిల్లా కలెక్టర్ డాక్టర్ యోగితా రాణా సైతం ఈ -ఆఫీస్‌పై అంతగా దృష్టి సారించకపోవడంతో అధికారులు సైతం ఫైళ్లను సర్కులేట్‌ను పాత విధానం లో కొనసాగించారు. అయితే గత మే లో ఈ ఆఫీస్ విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని ఆదే శాలు జారీ చేసిన కలెక్టర్ ఈ కార్యక్రమానికి ఇంఛార్జీ జాయింట్ కలెక్టర్ శ్రీవత్స కోట ను నోడల్ అధికారిగా నియమించారు. దీంతో ఈ ఆఫీస్‌పై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన ఇందుకు కావాల్సిన పనులను పూరి చేస్తు వచ్చారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం జూలై 1 నుంచి కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు ఈ ఆఫీస్ విధానంలో విధులు నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన ఈ ఆఫీస్ విధానం కలెక్టరేట్‌లో అమల్లోకి రానుంది. ఈ ఆఫీస్‌తో ఇక పనుల్లో వేగం: ఈ ఆఫీస్ విధానం అమల్లోకి వస్తే ప్రజల ఇక తమ పనుల నిమిత్తం నెలల తరబడి కలెక్టరేట్ చుట్టూ తిరగకుండానే రోజుల్లోనే పనులు పూర్తి కానున్నాయి. ఈ ఆఫీస్ ప్రక్రియ అమలు చేయడంతో అధికారులు, సిబ్బంది వనితీరు సులభతరం కావడమే కాకుండా తప్పించుకునే వీలుగా లేకుండా బాధ్యత మరింత పెరగనుంది. ఈ విధానం ద్వారా అధికారులు తమకు కేటాయించిన ప్రత్యేక ఐడితో వారు ఆఫీసులో లేకపోయిన కంప్యూటర్ నెట్ ఉంటే చాలు అత్యవసర పరిస్థితుల్లో అర్ధరాత్రికి కూడా ఇంటి వద్ద నుంచి కూడా విధులు నిర్వహించేందుకు వీలుంటుందని చెప్పారు. ఫైళ్లను ఒకే చేయవచ్చు. తద్వారా ప్రతి ఫైళ్లు గంటల వ్యవధిలో పూర్తి చేసే అవకాశం ఏర్పడనుంది. ఈ ఆఫీస్ తో ఆ అవకాశమే ఉండకపోగా, సురక్షితంగా ఉండనున్నాయి ఆఫీసుల్లో కూడా ఈ ఆఫీస్ విధానాన్ని అమలు చేయనున్నారు. ముందుగా ఆర్డీఓ, తహసిల్దార్ల కార్యాలయాల్లో సైతం ఈ విధానాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు.

# సెటిలర్ల కోసం కేసీఆర్ ప్లాన్...



ఆంధ్రా సెటిలర్ల పట్ల కేసీఆర్ వ్యూహం ఎలా ఉ ండబోతోందన్న చర్చలు ఊపందుకున్నాయి. ఇప్పటికే కాంగ్రెసు పార్టీ తన నిర్ణయాన్ని ప్రకటించేసింది. సొంతంగా బరిలోకి దిగాలా? లేక వేరే వారితో పొత్తు పెట్టుకోవాలా? అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతోంది టీడీపీ. బీజేపీ, మిగిలిన పార్టీలకు సెటిలర్లు పెద్దగా మద్దతిచ్చే సూచనలు కనిపించడం లేదు. టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెసులు వీరి ఓట్లను పంచుకునే అవకాశాలున్నాయి. ఎవరు ఎక్కువగా వీరిని ఆకట్టుకోగలరనే దానిపై 25 కి పైగా నియోజకవర్గాల జయాపజయాలు ఆధారపడి ఉన్నాయి. వీటిని గంపగుత్తగా తెచ్చుకోగలిగిన పార్టీకి గెలుపు నల్లేరుపై బండి మాదిరిగానే ఉంటుందని పరిశీలకుల అంచనా. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ సెటిలర్ల మద్దతు ఎవరికి ఉండబోతోందన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ వ్యక్తమవుతోంది. గుంభనంగా వ్యవహరించే ఈ ఓటర్ల నాడి పట్టుకోవడం ఎవరికి సాధ్యం కావడం లేదు. రాష్ట్రవిభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రజలు కాంగ్రెసును తీవ్రంగా ద్వేషించారు. వారితో పాటు తెలంగాణలో సెటిల్ అయినవారు కూడా కాంగ్రెసుకు గుణపాఠం చెప్పాలనుకున్నారు. దీంతో 20 నియోజకవర్గాలకు పైగా కాంగ్రెసు నష్టపోయినట్లు అంచనా. ఈమేరకు టీడీపీ, బీజేపీ కాంబినేషన్, కొన్ని చోట్ల టీఆర్ఎస్ లాభపడ్డాయి. ఈ విషయం తెలిసినా 2014 ఎన్నికల్లో కాంగ్రెసు చేయగలిగిందేమీ లేకుండా పోయింది. రాష్ట్రం ఇచ్చినందుకు తెలంగాణ ప్రజలు సంఘటితంగా తమ పార్టీకి మద్దతిస్తారని భావించారు. ఆ వ్యూహం వికటించింది. సెటిలర్లు పెద్ద సంఖ్యలో ఉ న్న ఏ నియోజకవర్గంలోనూ కాంగ్రెసు విజయం సాధించలేకపోయింది. 2019 ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో సెటిలర్లను ఆకట్టుకునే పనిలో పడింది కాంగ్రెసు నాయకత్వం. హైదరాబాదు, రంగారెడ్డి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొందరు సెటిలర్లను ఎంపిక చేసి కాంగ్రెసు టిక్కెట్లు ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది. ఏపీ ప్రత్యేక హోదా విషయంలో కాంగ్రెసు స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. దీంతో పార్టీ పట్ల వ్యతిరేకత తగ్గుముఖం పడుతుంది. సెటిలర్లు బరిలో నిలిస్తే ఓవరాల్ గా అన్నిచోట్ల వారి మద్దతు కాంగ్రెసుకు లభిస్తుందని అంచనా వేసుకుంటోంది. ఈ మేరకు అధిష్ఠానమూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్లుగా చెబుతున్నారు. ఈసారి టీడీపీకి తెలంగాణలో చుక్కెదురే. రాజకీయ పరిశీలకులు, విశ్లేషకులే కాదు పార్టీ అగ్రనాయకత్వమూ అదే అంచనాతో ఉంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో ఏదో ఒకపార్టీతో పొత్తు పెట్టుకోకపోతే తీవ్రమైన భంగపాటును చవిచూడాల్సి వస్తుందని ద్వితీయశ్రేణి నాయకులు హెచ్చరిస్తున్నారు. టీడీపీలో ఉంటూ గతంలో పదవులు అనుభవించిన కొందరు పార్టీని వీడలేకపోతున్నారు. ఇతర పార్టీల్లో తగిన పదవులు లేకపోవడమూ ఇందుకు కారణం. ఇప్పటికే అధికార టీఆర్ఎస్ కిక్కిరిసిపోయింది. కాంగ్రెసులో సీట్ల కొట్లాట ఎక్కువై పోయింది. దిగువశ్రేణి కార్యకర్తలు చాలా వరకూ పార్టీని వీడిపోయారు. సామాజిక పునాదుల కారణంగా బీసీ వర్గాల్లో ఇంకా అక్కడక్కడా పార్టీ పట్ల ఆదరణ వ్యక్తమవుతోంది.

# మమత తప్ప...మిగతా వాళ్ల సంగతేంటి...



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఉ న్నంత దూకుడు విపక్ష నేతల్లో మరెవరూ కన్పించడం లేదు. మమతలో కన్పించిన కసి వేరెవరిలో లేదు. విపక్ష పార్టీల్లో పట్టున్న నేతలే ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రులు అఖిలేష్ యాదవ్, మాయావతి, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వంటి వారు తమ రాష్ట్ర రాజకీయాలకే ఎక్కువగా పరిమితమవుతున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటుకు వీరు చేసే ప్రయత్నాలు పెద్దగా కన్పించడం లేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తొలి నాళ్లలో బీజేపీ, కాంగ్రెస్ లకు వ్యతిరేకంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. అనేక మంది నేతలను కూడా కలిశారు. మమతబెనర్జీ, దేవెగౌడ, అఖిలేష్ యాదవ్ వంటి నేతలను కలిశారు. ఆ తర్వాత ఇటీవల జరిగిన అవిశ్వాస తీర్మానంలో ఆయనకు బీజేపీ అనుకూల వైఖరిని అవలంబించారన్న విమర్శ ఉంది. అలాగే రాష్ట్రంలో కేసీఆర్ పార్టీకి ప్రధాన శత్రువు కాంగ్రెస్ కావడంతో ఆయన ఆ పార్టీతో కలిపి ఉన్న ఫ్రంట్ తో కలిసి నడిచే ప్రసక్తి ఉండదు. ఇక ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యారు. జాతీయ రాజకీయాలపై దృష్టి సారించాలని ఉన్నప్పటికీ, వచ్చే ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో చంద్రబాబు పెద్దగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం లేదు. కుమారస్వామిది కూడా అదే తంతు. ఆయన సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామి అయిన కాంగ్రెస్ తో ఆయన ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రాజకీయాలు చేసేంత ఓపిక, సమయం కుమారస్వామికి లేవు. ఇక మాయావతి, అఖిలేష్ యాదవ్ లు సొంత రాష్ట్రానికే పరిమితమయ్యారు. మాయావతి జాతీయ రాజకీయాల్లో చురుగ్గ పోషించాలని భావిస్తున్నప్పటికీ ఆమె చొరవ తీసుకుని ఎవరి వద్దకు వెళ్లడం లేదు. తాను కోరుకుంటున్న ప్రధాని పదవే తన దరికి వస్తుందని మాయా ఆశిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తుపై వెళదామనుకుంటున్న మాయావతికి మొదట్లోనే తేడా కొట్టడంతో ఆమె ప్రస్తుతం మౌనంగానే ఉన్నారు. ఇక తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమత బెనర్జీ మాత్రం బీజేపీ అంటేనే మండిపడుతున్నారు. ఎన్నార్సీ విషయంలో మమత ఫైరయినట్లు ఎవరూ కాలేదు. దేశంలో రక్తపాతం సృష్టించడానికి బీజేపీ కంకణం కట్టుకుందని తూలనాడారు. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీన మమత కోల్ కత్తాలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీకి విపక్షనేతలను ఆహ్వానించడానికి ఆమె మూడు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. బీజేపీని, మోడీని ఎదుర్కొన్నాలంటే విపక్షాలన్నీ ఐక్యతగా కొనసాగాలని మమత తీవ్ర ప్రయత్నమే చేస్తున్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాతో పాటు వివిధ నేతలను కలసి ఆమె ర్యాలీకి రావాలని కోరారు. సో? విపక్ష నేతల్లో మమత ఒక్కరే కొంత కమలం పార్టీపై కారాలు మిరియాలు నూరుతున్నట్లు కన్పిస్తున్నారు. మిగిలిన నేతలు మాత్రం తమ రాష్ట్ర సమస్యలతో సతమతమవుతున్నారు. మరి మమత ప్రయత్నాలు సఫలమవుతాయో?? లేదో? చూడాలి.

## భారత్‌కు ఎస్టీయే హోదా

భారత్‌కు ఎస్టీయే–1 హోదా ఇవ్వాలని అమెరికా నిర్ణయం తీసుకుంది. ఈ 'వ్యూహాత్మక వాణిజ్యహోదా'తో అమెరికా మిత్రదేశాలకు ఎలాంటి రాయితీలు అందుతాయో అవన్నీ భారత్‌కు కూడా అందనున్నాయి. ట్రంప్ సర్కార్ తాజా నిర్ణయంతో భారతీయులు హర్షం వ్యక్తం చేస్తుండగా.. చైనా, పాక్ లాంటి దేశాలు మాత్రం గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది. బరాక్ ఒబామా హయాంలో ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన 4 కూటముల్లో సభ్యత్వం ఉన్న దేశాలకే సైనిక ఆయుధాలను విక్రయ స్వామిని అమెరికా నిబంధనను తీసుకువచ్చింది. ఆ నాలుగు కూట ములు.. అణు ఇంధన సరఫరాదారుల కూటమి (ఎన్ఎస్‌జీ), ఆస్ట్రే లియా కూటమి, వాసెనార్ ఒప్పందం, క్షిపణి పరిజ్ఞాన నియంత్రణ వ్యవస్థ. వీటిలో అణు ఇంధన సరఫరాదారుల కూటమిలో తప్ప మిగిలిన మూడింటిలో భారత్‌కు సభ్యత్వం ఉంది. ఎన్ఎస్‌జీలో సభ్యత్వం కోసం గత కొంత కాలంగా భారత్ తీవ్రంగా ప్రయత్నిం చింది. కానీ, చైనా గట్టిగా అడ్డుచెప్పడంతో మనకు సభ్యత్వం రాలే దు. మిగతా దేశాలన్నీ అనుకూలంగా ఉన్నా.. చైనా అడ్డుపడుతోంది. అంతేకాకుండా భారత్–అమెరికా రక్షణ ఒప్పందాలపై, ముఖ్యంగా సాంకేతిక బదలాయింపుపై చైనా వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో చైనా ఒత్తిడి వల్లే భారత్‌కు నూతన పరిజ్ఞాన బదలాయింపు జరగలేదు. అయితే ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దూకుడుగా నిర్ణాయాలు తీసుకుంటు న్నారు. చైనాను నిలువరించడానికి వీలుగా ఆ దేశం భారత్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. అమెరికాకు సంబంధించి 2 ఆయుధ నియం త్రణ వ్యవస్థలు ఉన్నాయి. అంతర్జాతీయ ఆయుధాలపై నియంత్రణ, ఎగుమతుల నియంత్రణలు ఉన్నాయి. ఒబామా హయాంలోనే రక్షణ వ్యవస్థలో భారత్‌కు కీలక భాగస్వామి హోదా ఇచ్చారు.

తొలి పలుకు



# ధర్మపురి అభివృద్ధికి 50 కోట్లు


:తెలంగాణ దేవస్థానాల పునరుద్ధరణ, పునర్మిర్మాణ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఈ ఏడు రాష్ట్ర బడ్జెట్‌లో ధర్మపురి క్షేత్రానికి 50కోట్ల నిధులను కేటాయించింది. తదనుగుణంగా దేవస్థానంలో చేపట్టాల్సిన పనులపై అధికారులు సంసిద్ధమవుతూ, రూపకల్పనలు చేయడానికి ఉపక్రమిస్తున్న వేళ...సంప్రదాయ ఆచరణకు భంగం వాటిల్లకుండా పనులు చేపట్టాలనే విషయంలో ప్రస్తుతం క్షేత్రంలో విస్తృత చర్చలు జరుగుతున్నాయి. భారతీయ ప్రాచీన సభ్యతా సంస్కృతులకు, సనాతన సాంప్రదాయాలకు అనాదిగా నిలయమై, విశేష పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని, పలు దేవాలయాల సముదాయంతో విరాజిల్లు తున్నది గంభీర గౌతమీ తటమున వెలసిన పవిత్ర తీర్థం ధర్మపురి పుణ్యక్షేత్రం. దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా, హరిహర క్షేత్రంగా, తెలుగు నేలపై వాసికెక్కి శాతవాహన, రాష్ట్రకూట, చాళుక్య. కాకతీయ, రేచర్ల వెలమాది హైందవ, నిజాం ప్రభువుల ప్రాభవంలో మహోన్నత వైభవాన్ని అనుభవించినదీ క్షేత్రరాజం. ఇక్కడి ప్రాచీన ఆలయాలలో...సనాతన సాంప్రదాయాలు నేటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి నిర్మాణంలోనూ ప్రత్యేకత దృగ్గోచరమవుతుంది.



ఇది హరిహర అభేద్య క్షేత్రం. బ్రహ్మ విష్ణు మహేశ్వర త్రైమూర్త్య నిలయం. ప్రధాన దైవం నృసింహుడే అయినా, స్మార్త ఆగమ పద్ధతిని అనుసరిస్తూ వస్తున్న క్రమం. స్మార్తులచే నిత్య పంచోపనిషత్ యుక్త వేదఘోషలు, అర్చకులు పూజలు నిర్వహిస్తుండడం అనాదిగా ఆచరణలో ఉంది. ప్రధానాలయ నృసింహాలయ ప్రాంగణాన చుట్టూ ఆంజనేయ విగ్రహాలుండడం విశేషం.రాష్ట్ర పురావస్తు శాఖచే రిజిస్టర్ అయిన దేవస్థానంలో గతంలోనూ పునర్మిర్మాణాలు చేసిన సందర్భాలలో అభ్యంతరాలు చోటు చేసుకున్నాయి. గణపతి ఆలయ నిర్మాణం, రామలింగేశ్వరాలయ ప్రహారీ విషయాలలో పురావస్తు శాఖ అభ్యంతరాలను తెలిపి, తప్పులను సవరించే చర్యలను గైకొంది. నారసింహ ప్రధానాలయ, శివాలయాల కుడ్యాలకున్న అపురూప ప చెక్కడాల, శాసనాల కనుమరుగుపై పురావస్తు శాఖ కనె?నత్ర చేసింది. ఇకముందు అలా జరగనీయమని, పూర్వానుమతులు లేనిదే పనులు చేపట్టమని లిఖితపూర్వకంగా రాయించుకుంది. ప్రస్తుత ప్రతిపాదిత నృసింహాలయ విస్తరణకు సంబంధించి, గర్భాలయ, అర్థ మంటప, పంటపాలను వాటి కొలతలకు అనుగుణంగా పతక రచనలు చేయడానికి ఆగమాధారాన్ని అనుసరించాల్సి ఉంది. ఆలయాన్ని ఆనుకుని ముందు భాగాన కాకతీయ నిర్మిత కళ్యాణ మంటపం ఉంది. శివాలయ ముఖ ద్వారం చారిత్రక నేపథ్యాన్ని కలిగి, గతంలోనే పురావస్తు శాఖ పునర్నిర్మాణానికి అడ్డుపడింది. బ్రహ్మపుష్కరిణికి ఉత్తర ద్వారం గుండానే స్థానిక దైవాలు తెప్పోత్సవ, డోలోత్సవాలకు వేంచేసి, తిరిగి అదే ద్వారం గుండా ఇసుకస్థంభం వద్దకు వెళ్ళడం స్థల పురాణాధారం.ఆచరణలో ఉన్న క్రమం. గతకొంత కాలంగా చేపడుతున్న వివిధ మార్పులు, చేర్పుల విషయంలో దేవస్థాన నిర్వాహకుల ఏకపక్ష నిర్ణయాలతో, బాధ్యతలేని అధికారుల అలసత్వంతో, క్రమక్రమంగా దేవస్థాన సంప్రదాయాలకు విలువ లేకుండా అవుతున్నది. సనాతనత్వం కనుమరుగు అవుతున్నది. ఈ నేపథ్యంలో 30కోట్ల ప్రతిపాదిత పనులను నిర్ణయించే ముందు అనుభవైకవేద్యులైన స్మార్త ఆగమ పండితులతో చర్చించి, సనాతన సాంప్రదాయాచరణకు భంగం వాటిల్లకుండా చూడాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. అభివృద్ధి ఆహ్వానామోదమే అయినా, కోట్లాది నిధులతో ఆలయాల పునరుద్ధరణ పేరిట కృత్రిమ మెరుగులెన్ని దిద్దినా, వెల కట్టజాలని వేల సంవత్సరాల ప్రాచీనత్వం, సనాతనత్వం తిరిగి పొందజాలమనేది నిర్వివాదమైన నగ్నసత్యం.

# ఖమ్మంలో పొలిటికల్ వార్ షురూ...


ఖమ్మం జిల్లాలో మాత్రం రాజకీయ సెగ ప్రారంభమైంది. ఎప్పుడు ఎన్నికలొచ్చినా సిద్ధంగా ఉండాలంటూ ఆయా రాష్ట్ర పార్టీల సూచన మేరకు పలు పార్టీలు తమ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నాయి. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రారంభమైన సందడితో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. గెలుపు గుర్రాల కోసం.. పూర్వ వైభవం కోసం.. సత్తా చాటేందుకు ఎవరికి వారే వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. టీడీపీ సైతం వచ్చే ఎన్నికల్లో ఉనికి చాటుకునేందుకు తాపత్రయ పడుతోంది. కాంగ్రెస్ వంటి పార్టీలతో ఎన్నికల పొత్తే మేలన్న భావనతో పార్టీ కార్యకర్తలకు నచ్చజెప్పేందుకు యత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక జిల్లాలో బలమైన రాజకీయ పక్షాలుగా పేరున్న ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఈసారి ఎన్నికల్లో ఎటువంటి వ్యూహం రచిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. 2014లో జరిగిన ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టులు వేర్వేరు పార్టీల మద్దతుతో జిల్లాలో ఎన్నికల బరిలోకి దిగగా.. ఈసారి కూడా అదే పరిస్థితి ఆవిష్కృతమయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.సీపీఎం బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) కూటమితో కలిసి ఎన్నికల బరిలోకి దిగనుండగా.. సీపీఐ.. కాంగ్రెస్‌తో మరోసారి ఎన్నికల మైత్రి కొనసాగించే అవకాశం ఉన్నట్లు ప్రచారమవుతోంది. దీంతో కాంగ్రెస్ తరఫున కొత్తగూడెం నుంచి టికెట్ ఆశిస్తున్న ఆశావహుల్లో ఉత్కంఠ కలుగుతోంది. ఎన్నికల పొత్తులో ఏ నియోజకవర్గం ఎటువైపు వెళ్తుందో అనే అంశం ఒక పట్టాన తేలకపోవడంతో ఆయా నియోజకవర్గాలపై తమ పట్టు సడలకుండా పార్టీ కార్యకలాపాలను ఎవరికి వారే హోరాహోరీగా కొనసాగిస్తున్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకే ఒక్క స్థానం గెలుచుకున్న టీఆర్ఎస్.. ఈసారి పది నియోజకవర్గాల్లో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. గత ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన జలగం వెంకటరావు విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జిల్లాకు చెందిన తుమ్మల నాగేశ్వరరావు టీడీపీకి రాజీనామా చేసి.. 2014లో టీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వెంట జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ, డీసీసీబీ చైర్మన్ వంటి నేతలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొండబాల కోటేశ్వరరావు వంటి నేతలు గులాబీ గూటికి చేరగా.. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ టీఆర్ఎస్‌లో చేరారు.పాలేరు నుంచి గెలుపొందిన మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి అనారోగ్యంతో మరణించారు. దీంతో 2014 ఎన్నికల్లో నాలుగు ఎమ్మెల్యే స్థానాలను గెలుపొందిన కాంగ్రెస్‌కు.. ప్రస్తుతం మధిర ఎమ్మెల్యే, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క మాత్రమే జిల్లాలో మిగిలారు. పాలేరులో జరిగిన ఉప ఎన్నికల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టీఆర్ఎస్ తరఫున గెలుపొందారు. ఇక గత శాసనసభ ఎన్నికల్లో జిల్లాలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది.




ఖమ్మం ఎంపీతోపాటు వైరా, అశ్వారావుపేట, పినపాక ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేర్వేరుగా టీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం టీఆర్ఎస్‌కు జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నట్లయింది. దీంతో వచ్చే ఎన్నికల్లో వీటిని నిలబెట్టుకోవడంతోపాటు రాజకీయంగా అత్యంత కీలకంగా, ప్రతిష్టాత్మకంగా భావించే సత్తుపల్లి, మధిర, భద్రాచలం నియోజకవర్గాల్లో సైతం గులాబీ జెండా ఎగరేసేందుకు టీఆర్ఎస్ కసరత్తు ప్రారంభించింది. ఆయా నియోజకవర్గాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించడం.. తరచూ రాజకీయ పర్యటనలు చేస్తూ పార్టీశ్రేణుల్లో ఉత్తేజం నింపే ప్రయత్నం చేస్తున్నారు.కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వంటి రాజకీయ పక్షాలు తమకు పట్టున్న నియోజకవర్గాలపై ఇప్పటికే దృష్టి సారించారు. ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన వ్యూహ ప్రతివ్యూహాలు రూపొందిస్తుండగా.. అందుకు దీటుగా అధికార పార్టీ జిల్లాలో అన్ని ఎమ్మెల్యే స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. టీఆర్ఎస్ కొద్ది రోజులుగా రాజకీయంగా దూకుడు పెంచింది. ప్రతిపక్ష కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంపై పూర్తిస్థాయి దృష్టి సారించింది. ఆయా మండలాల నుంచి వివిధ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నేతలను టీఆర్ఎస్‌లో చేర్చుకోవడం ద్వారా మధిరలో తమకు సానుకూల పవనాలు వీస్తున్నాయన్న భావన కల్పించే ప్రయత్నం చేస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో కలుగుతోంది. ఇక పది అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో టీఆర్ఎస్ విజయ పతాకం ఎగురవేసే బాధ్యతను తానే తీసుకుంటానని మంత్రి తుమ్మల స్వయంగా ప్రకటించడంతో పార్టీ రాజకీయ వ్యూహాలకు పదును పెట్టిందన్న అభి ప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పర్యటిస్తూ.. తమ బలాలు, బలహీనతలపై దృష్టి సారించి ఎన్నికల ప్రచార పర్వానికి అందరికంటే ముందు సిద్ధమవుతున్నారన్న భావన కలుగుతోంది. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో జరిగిన అభివృద్ధిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతోపాటు జిల్లాలోని టీఆర్ఎస్‌యేతర రాజకీయ పక్షాల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తులు, కీలక నేతల వ్యవహార శైలి, ఆయా పార్టీలతో వారు అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై ప్రత్యేక దృష్టి సారించింది.ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో రాజకీయంగా జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు మంత్రి తుమ్మలకు చేరవేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని టీఆర్ఎస్‌లో నెలకొన్న పరిస్థితులపై మంత్రి ఆయా నియోజకవర్గాల నేతల ద్వారా ఆరా తీయడంతోపాటు పార్టీ నేతలకు సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ పరంగా నెలకొన్న జఠిల సమస్యలపై దృష్టి సారించేందుకు పార్టీ యంత్రాంగం సమాయత్తమైనట్లు తెలుస్తోంది. జిల్లాలో జనరల్ స్థానాలుగా ఉన్న పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తుమ్మల నాగేశ్వరరావు, పువ్వాడ అజయ్‌కుమార్, జలగం వెంకటరావు, ఖమ్మం ఎంపీగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. అక్కడ తిరిగి విజయం సాధించేందుకు ఆయా నేతలు ఇప్పటి నుంచే చెమటోడుస్తున్నారు. నియోజకవర్గాల్లో జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తాము ఇస్తున్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పుకునే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.

# కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ యాత్రలు షురూ...

13:కాంగ్రెసు, బీజేపీలు కార్యాచరణకు దిగిపోయాయి. పార్లమెంటు సమావేశాలు ముగిసి ఒకరోజు కూడా కాకుండానే రాజకీయయాత్రలకు అగ్రనాయకులు శ్రీకారం చుట్టారు. డిసెంబరులో ఎన్నికలు జరపాల్సి ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ , మిజోరాంలపై దృష్టిసారించారు. కాంగ్రెసు అధినేత రాహుల్ గాంధీ రాజస్థాన్లో 13 కిలోమీటర్ల రోడ్డు షోతో ఎన్నికల నగారా మోగించారు. మధ్యప్రదేశ్ లో 32 మందితో పోల్ కమిటీని నియమించారు. మరోవైపు న్యాయపోరాటం, ఎన్నికల కమిషన్ పై ఒత్తిడి పెంచడం , ప్రజల్లో విస్తృతంగా పర్యటనలు నిర్వహించడం వంటి బహుముఖ విధానాలను అవలంబించబోతున్నారు. మరోవైపు అమిత్ షా నేతృత్వంలో బీజేపీ పాలిత ఎన్నికల రాష్ట్రాల కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధమవుతోంది. ప్రజాక్షేత్రంలో బాహాబాహీ తలపడేందుకు రానున్న మూడు నెలల కార్యాచరణను ఈ రెండు పార్టీల అగ్రనేతలు ఇప్పటికే ఖరారు చేసుకున్నారు. అమిత్ షా క్షేత్రస్థాయి పర్యటనలతో క్యాడర్ కు సంబంధించి ముందస్తు కసరత్తు మొదలుపెట్టేశారు. ప్రజల్ని కలిసే కార్యక్రమాలు, బహిరంగ సభల నిమిత్తం ప్రధాని షెడ్యూలుపైనా ప్రాథమిక మైన యాక్షన్ ప్లాన్ తయారైంది. తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఓటర్ల లిస్టులో అక్రమాలపై కాంగ్రెసు పార్టీ పోరాటం మొదలు పెట్టింది. మూడు దఫాలుగా వరసగా విజయాలు సాధిస్తూ వస్తున్న మధ్యప్రదేశ్ ను లక్ష్యంగా చేసుకుంది. కాంగ్రెసు పార్టీకి కమలనాథ్ వంటి సీనియర్ నాయకులు ఉన్నారు. జ్యోతిరాదిత్య సింధియా వంటి యువతరం నేతలకూ కరవు లేదు. అయినప్పటికీ సంఘటితమైన బలంతో బీజేపీ అనాయాస విజయాలు సాధిస్తోంది. ఇక్కడ లక్షల సంఖ్యలో నమోదైన అక్రమ ఓట్లు ఇందుకు కారణమని కాంగ్రెసు అనుమానిస్తోంది. ముందుగా వాటిపై దృష్టి పెట్టింది. దాదాపు 60 లక్షల మేరకు రెండేసి చోట్ల నమోదైన ఓట్లు, దొంగ ఓట్లు, అనామతు పేర్లతో కూడిన ఓట్లు చెల్లుబాటవుతున్నాయి. వీటన్నిటినీ ఏరిపారేయాలని హస్తం పార్టీ పట్టుపడుతోంది. ఎన్నికల కమిషన్ మీనమేషాలు లెక్కిస్తోంది. రాజకీయ కారణాలే ఇందుకు కారణమనేది కాంగ్రెసు అనుమానం. అక్రమ ఓట్ల అంతుచూసే ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. మరోనాలుగు నెలల్లో ఎన్నికలు జరపనుండగా , ఇప్పటికీ దొంగ ఓట్లు యథాతథంగా ఉండటాన్ని ప్రమాద సంకేతంగా కాంగ్రెసు భావిస్తోంది. వీటిపై న్యాయపోరాటానికి దిగింది. సుప్రీం కోర్టులో కేసు వేసింది. న్యాయస్థానం కూడా వేగంగా స్పందించి వీటిపై ఆరా తీస్తూ విచారణ మొదలుపెట్టడం తొలి నైతిక విజయంగా కాంగ్రెసు భావిస్తోంది. జనవరి నెలలోనే ఎన్నికల కమిషన్ కు దొంగ ఓట్లపై వివరాలు అందాయి. కానీ చాలా నెమ్మదిగా స్పందించింది సీఈసీ. 24 లక్షల ఓట్లు అక్రమమని ఎట్టకేలకు నిర్ధరించింది. అంటే మధ్యప్రదేశ్ లో భారీ ఎత్తున అక్రమ ఓట్లు గతంలో చెలామణి అయినట్లు పరోక్షంగా అంగీకరించినట్లే. ఈ 24 లక్షల ఓట్ల తొలగింపును పక్కనపెట్టి మిగిలిన దొంగ ఓట్ల సంగతేమిటని కాంగ్రెసు నిలదీస్తోంది. కనీసం మరో 35 , 36 లక్షల బోగస్ ఓట్లు ఉన్నాయనేది హస్తం పార్టీ వాదన. ఎన్నికల కమిషన్ ఈవాదనతో ఏకీభవించడం లేదు. అందుకే సుప్రీం కోర్టులో కేసు వేసి ఎన్నికల సంఘాన్ని న్యాయస్థానం బోను ఎక్కించింది



కాంగ్రెసు. ఈసారి ఎన్నికలు ఓటర్లకు నమ్మకం కలిగించే వోటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ విధానంలో పెట్టాలని డిమాండు చేస్తోంది. కానీ అందుకు తగినన్ని పేపర్ మిషన్లు అందుబాటులో లేవు. 16.15 లక్షల యూనిట్లు అవసరమని అంచనా వేయగా, ఇంతవరకూ 5.88 లక్షలు మాత్రమే తయారయ్యాయి. వీటన్నిటినీ సాకుగా చూపుతూ వీవీపీఏటీలతో ఎన్నికలు సాధ్యం కాదని ఎలక్షన్ కమిషన్ చెబుతోంది. దీనివల్ల అక్రమాలు చోటు చేసుకుంటాయి. ఎన్నికల సంఘం నిర్లక్ష్యం, ఉదాసీనత కారణమవుతోందని కాంగ్రెసు ఆరోపిస్తోంది. దీనిని న్యాయస్తానంలో తేల్చుకునేందుకు , ఎన్నికల సంఘాన్ని దోషిగా నిలిపేందుకు హస్తం పార్టీ ప్రయత్నిస్తోంది. దక్షిణాది లో తెలంగాణలో ముందస్తు ఎన్నికలు జరిగే సూచనలున్నట్లుగా కాంగ్రెసు అనుమానం. బీజేపీ, టీఆర్ఎస్ ల మధ్య ఇటీవల పెరిగిన సాన్నిహిత్యం ఇందుకు కారణం. అసెంబ్లీకి ముందస్తుగా ఎన్నికలకు వెడితే లోక్ సభ పై దాని ప్రభావం పడదనే యోచనలో కేసీఆర్ ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయం మోడీతో సైతం చర్చించారని మీడియాలో కొన్నివర్గాలు పేర్కొంటున్నాయి. ఇది సాధికారికం కాకపోయినా నడుస్తున్న పరిస్థితులను బట్టి వేస్తున్న అంచనా. రాహుల్ గాంధీ రంగంలోక అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో నిలదొక్కుకునేందుకు అవసరమైన సహాయసహకారాలు అందించబోతున్నారు. నెలాఖరులోగా ఏపీలో కూడా రాహుల్ పర్యటనను ఖరారు చేస్తున్నారు. సెప్టెంబరు నెలలో అమిత్ షా సైతం ఈ రెండు తెలుగు రాష్ట్రాలలో పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు. ఏతావాతా ఎక్కడ అవకాశం ఉన్నా వదలకుండా తమ బలాన్ని పరీక్షించుకునేందుకు ఇరుపక్షాలు రంగంలోకి దిగుతున్నాయి.

# రాములమ్మ రీ ఎంట్రీ

రాములమ్మ వచ్చేస్తోంది.. మళ్లీ రాజకీయాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగుతోంది. గత ఎన్నికల తర్వాత నాలుగేళ్లుగా మౌనంగా ఉన్న ఆమె ఇటీవల మహంకాళి అమ్మవారికి ఏకంగా బంగారు బోనం సమర్పించారు. ఈ బంగారు బోనమే తన రీ ఎంట్రీకి సంకేతమని ఆమె చెప్పకనే చెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగుతున్నానని పరోక్షంగా సంకేతాలు ఇచ్చేశారు. కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రపోషించేందుకు సన్నద్ధమవుతున్నారా..? అనే చర్చకు అమ్మవారి సాక్షిగా ఆస్కారమిచ్చారు. నిజానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన ప్రజాచైతన్య బస్సుయాత్ర సందర్భంగానే రాములమ్మ మళ్లీ రంగంలోకి దిగుతున్నారనే టాక్ వినిపించింది. కానీ, పార్టీ విడతలుగా చేపట్టిన బస్స?యాత్రల్లో రాములమ్మ కనిపించలేదు. ఇప్పుడు అమ్మవారికి బంగారు బోనం సమర్పించడంలో మళ్లీ ఆమె రాకపై చర్చ జరుగుతోంది. నిజానికి తెలుగు చిత్రసీమలో విజయశాంతిది చెరగని ముద్ర. స్టార్ హీరోలతో సమానంగా రాణించిన హీరోయిన్. నటనలో, డ్యాన్సలో చిరంజీవిలాంటి హేమాహేమీలతో పోటాపోటీగా రాణించారు. స్టార్ హీరోలకు ఏమాత్రం తగ్గని ఇమేజ్ను సొంతం చేసుకున్నారు. ఇక వుమెన్ ఓరియెంటెడ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. తనకంటూ సొంత అభిమాన లోకాన్ని సృష్టించుకున్నారు. ఈ క్రమంలో ఎందరో హీరోయిన్లు వస్తున్నారు.. పోతున్నారు.. కానీ.. రాములమ్మగా విజయశాంతి అభిమానుల గుండెల్లో తలదాచుకున్నారు. అనంతరం రాజకీయరంగంలోనూ తన ప్రత్యేకతను చాటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమె ఉద్యమించారు. ఈ క్రమంలో సొంతంగా తల్లి తెలంగాణ పార్టీ కూడా ఏర్పాటు చేశారు. అనంతరం ఆ పార్టీ కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్లో విలీనం చేశారు. ఒకానొక దశలో టీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ తర్వాత రెండో స్థానంలో నిలిచారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న 10 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల్లో పోటీ చేయడానికి ఐదు స్థానాలకు అభ్యర్థులు ఖరారు అయ్యారని, మిగిలిన ఐదు స్థానాల్లో అభ్యర్థుల పోటీ తీవ్రంగా ఉన్నట్టు విశ్వనీయ వర్గాల సమాచారం. కాగా, ప్రముఖ సినీనటి, మాజీ ఎంపీ విజయశాంతిని మెదక్ నియోజకవర్గ ఇన్చార్జీగా నియమించిన ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మెదక్ ఎమ్మెల్యేగా లేదా ఎంపీగా పోటీ చేసే నిర్ణయాన్ని ఆమెకే వదిలేసినట్లు ప్రచారం జరుగుతున్నది. కాగా, విజయశాంతి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్టు సమాచారం. పీసీసీ చీఫ్ ఉత్తమ్కుమార్ రెడ్డి ఇటీవల మాట్లాడుతూ ఎన్నికలకు ఆరు నెలల ముందే పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపిన విషయం తెలిసిందే. మెదక్ ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఐదు మినహా మిగలిన ఐదు నియోజకవర్గాల నుండి పోటీ పడుతున్న అభ్యర్థులు పైరవీలు ముమ్మరం చేశారు. ఈ నెల 13న రాహుల్ హైదరాబాద్ వస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులు జనాలను తరలించే విషయంలో నిమగ్నమయ్యారు. మెదక్ నుండి విజయశాంతి, నర్సాపూర్ నుండి మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, జహీరాబాద్ నుండి డాక్టర్ గీతారెడ్డి, అందోల్ నుండి మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి నుండి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేర్లు వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఖరారయ్యారని అంటున్నారు. ఒకవేళ రాములమ్మ పార్లమెంట్కు పోటీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తే, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తదితరులు ఆ అవకాశాన్ని చేజిక్కించుకోవాలని పోటీ పడుతున్నట్లు తెలిసింది. వీరంతా రాష్ట్ర నేతల వద్ద పైరవీలు చేయిస్తున్నారని సమాచారం. సురేష్ షెట్కార్ ఎంపీగా పోటీ చేసేందుకు అంగీకరిస్తే ఖేడ్ నియోజకవర్గం నుంచి సంజీవరెడ్డిని ఎమ్మెల్యే బరిలోకి దించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. పటాన్చెరు నియోజకవర్గం నుండి శ్రీనివాస్గౌడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. అంతేగాక, జిన్నారం జడ్పీటీసీ ప్రభాకర్ పటాన్చెరు నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సునీతా రెడ్డితో పైరవీ చేస్తున్నారని అంటున్నారు. కార్పొరేటర్ శంకర్ యాదవ్ కూడా ఇదే నియోజకవర్గం నుండి ఎమ్మె ల్యే బరిలో నిలిచేందుకు పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది. సిద్దిపేట నియోజకవర్గం నుండి యూత్ కాంగ్రెస్ ఆలిండియా సెక్రటరి హరికృష్ణ, నియోజకవర్గ ఇంచార్జీ శ్రీనివాస్గౌడ్ ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. అదే విధంగా జిల్లా కార్యదర్శి చొప్పదండి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ వర్మ ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీ పడుతున్నట్లు తెలిసింది. గజ్వేల్ నియోజకవర్గం నుండి టీడీపీ నుండి కాంగ్రెస్లో చేరిన ప్రతాప్రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, దివంగత రంగారెడ్డి కుమారుడు జశ్వంత్రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దుబ్బాక నియోజకవర్గం నుండి మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి, ఎంపీగా పోటీ చేసిన శ్రావణ్కుమార్ రెడ్డి ఎమ్మెల్యే బరిలోకి దిగాలని ఉత్సాహపడుతున్నట్టు వార్తలు ఉన్నాయి. చెరుకు ముత్యంరెడ్డికి మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశిస్సులు ఉన్నాయని, శ్రావణ్కుమార్రెడ్డికి సునీతారెడ్డి మద్దతు ఉందని ప్రచారం సాగుతున్నది. ఈ విధంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు రాజధాని హైదరాబాద్లో పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారని అంటున్నారు. నర్సాపూర్ నుండి మాజీ మంత్రి సునీతారెడ్డి, సంగారెడ్డి నుండి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, అందోల్ నుండి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ నుండి మాజీ ఎంపీ



విజయశాంతి, జహీరాబాద్ నుండి మాజీ మంత్రి గీతారెడ్డి 2019 ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధిష్టాన వర్గం గ్రీన్సిగ్నల్ ఇచ్చినట్లుగా విశ్వనీయ వర్గాల ద్వారా తెలిసింది. 2009 ఎన్నికల్లో ఆమె మెదక్ నుంచి ఎంపీగా గెలిచారు. ఆతర్వాత విభేదాలు రావడంతో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014ఎన్నికల్లో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇక ఆ తర్వాత దాదాపుగా రాజకీయాలకు పూర్తిగా దూరమయ్యారు. అయితే, ఇటీవల మళ్లీ ఆమె రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేందుకు సిద్ధమవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించేందుకు పార్టీ అధిష్టానం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం.. మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత శశిధర్రెడ్డి చురుగ్గా ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు రెండు వర్గాలు విడిపోయినట్లు సమాచారం. ఇటీవల నియోజకవర్గంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలోనూ శశిధర్రెడ్డి, విజయశాంతి వర్గీయులు బాహీబాహీకి దిగడం గమనార్హం. ఈ నేపథ్యంలో టికెట్ విషయంలో పార్టీవర్గాల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

## కరుణానిధి కుటుంబంలో గ్రూపులు

డీఎంకేలో కుటుంబ తగాదాలు తలెత్తకుండా కుటుంబసభ్యులు రంగంలోకి దిగారు. ఆళగిరిని సముదాయించే పనిలో ఉన్నారు. ఈ నెల 14వ తేదీన డీఎంకే సర్వసభ్య సమావేశం జరగనుంది. తొలుత ఈ సమావేశంలోనే స్టాలిన్ ను డీఎంకే అధ్యక్షు డిగా చేయాలని భావించారు. అయితే ఆళగిరితో పూర్తి స్థాయి చర్చలు జరిపి, ఆయనతో ఒక అంగీకారం కుదిరిన తర్వాతనే డీఎంకే అధ్యక్షు డిగా స్టాలిన్ ను ప్రకటించాలని కొందరు సీనియర్ నేతలు భావిస్తు న్నారు. ఈ నెల 14వ తేదీన జరిగే సర్వ సభ్య సమావేశంలో కేవలం కరుణానిధి మృతికి సంతాపం ప్రకటించేందుకే పరిమితమ వుతారని తెలుస్తోంది.ఆళగిరి వాస్తవానికి ఇప్పుడు పార్టీలో లేరు. ఆయనను కరుణానిధి బతికున్నప్పుడే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కరుణ మృతితో తిరిగి ఆళగిరి పార్టీలో కీలక భూమిక పోషించాలని ఉవ్విళ్లూరుతున్నారు. పెద్ద కుమారుడిగా తాను పార్టీని నడిపిస్తానని సన్నిహితుల వద్ద ఆళగిరి వ్యాఖ్యనించారని తెలుస్తోంది. ఆళగిరి ఫేస్ బుక్ లో ఒక వీడియో పోస్టు చేశారు. అది తమిళనాడులోనూ, డీఎంకేలోనూ కలకలం రేపుతుంది.ఈ వీడియోలో తనను అడ్డుకునే వాడు ఎవరురా? అనే పాట ఉంది. కొన్నేళ్ల క్రితమే ఈ వీడియోను రూపొందించినా శనివారం ఈ వీడియోను ఆళగిరి తన ఫేస్ బుక్ పేజీలో పోస్టు చేయడంతో వారసత్వ పోరు తప్పదని తేలిపోయింది. ఈ పాటలో ''ఇక ఆటను చూడరా?అడ్డుకునేది ఎవడురా?.సింహ తమిళ..అంటూ పాట సాగడంతో ఆళగిరి ఖచ్చితంగా డీఎంకేలో పెద్ద పదవినే ఆశిస్తున్నారని అర్థమవుతుంది. ఈ పాటను ఫేస్ బుక్ పేజీలో ఆళగిరి స్వయంగా పోస్ట్ చేయడంతో కుటుంబ సభ్యుల్లోనూ కలవరం బయలుదేరింది. కరుణ కుటుంబ సభ్యులు రంగంలోకి దిగారు. పార్టీలో ఆళగిరికి తగిన ప్రాధాన్యత కల్పించాలని కుటుంబ సభ్యులు కూడా స్టాలిన్ కు సూచించారు. అయితే తనకు కీలకమైన పదవి ఇవ్వాల్సిందేనని ఆళగిరి పట్టుబడుతున్నారు.

# మొక్కలు నాటడం అందరి బాధ్యత

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో హరితహార కార్యక్రమాన్ని విద్యార్థిని విద్యార్థులు యువకులు సంఘ సంస్కర్తలు మరియు వివిధ కళాశాలల యాజమాన్యం పాలు పంచుకుని , ఈ యొక్క కార్యక్రమాన్ని కుతూహలంతో, ఉత్సాహంతో, పట్టుదలతో ,క ృషితో ఒక కన్నుల, విన్ను ల పండుగలా జరుపుకున్నారు .ఈ కార్యక్రమంలో తెలంగాణ బి.సి.దళ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోవూరి. సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో భూమి యొక్క ఉపరితలం పైన ప్రతి ఒక్క జీవి మనుగడ ప్రకృతిపైనే ఆధారపడి ఉందని అలాంటి ప్రకృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి యొక్క పౌరుడిది.మనం ఎప్పుడైతే వర్షాకాలాన్ని సద్వినియోగ పరచుకుంటు మొక్కలు నాటడం మన బాధ్యత, ప్రక ృతిని కాపాడుకోవడం మన బాధ్యతగా ఎప్పుడైతే ప్రతి ఒక్కరు ఆచరణలొ పెడుతూ పాటిస్తారొ అప్పుడే అన్ని కాలాలు సరి సమానం లో ఉంటాయి .కావున మన తెలంగాణ రాష్ట్రంలో నాలుగు కోట్ల ప్రజలు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లను నాటడం వల్ల



భావి తరాలకు భవిష్యత్తు బాటను వేసిన వాళ్ళము అవుతామని అందరి సమక్షంలో తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పద్మనాభ డిగ్రీ కాలేజీ ,గ్లోబల్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనిల్ గారు ,విజ్డమ్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ వై పరమాత్మ గారు ,సరస్వతి శిశుమందిర్ హైస్కూల్ డైరెక్టర్ భగ్వాన్ గారు ,గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కో కన్వీనర్ యస్.రాధాక ృష్ణ , తెలంగాణ బీసీ దళ్ జిల్లా ఉపాధ్యక్షులు జి.శంకర్ గౌడ్ ,తెలంగాణ బీ.సీ దళ్ మండల అధ్యక్షులు ఎర్ర.వీరేందర్ గౌడ్, సదాశివపేట శ్రీరామ సేనా యూత్ అసోసియేషన్ నాయకులు జి.చందు గౌడ్ , రాకేష్ గౌడ్ , అ0బదాసు , శ్రీనివాస్ గౌడ్,స్థాయి ,అఖిల్ ,మోహన్ ,కిషోర్ మరియు సదాశివపేట పట్టణ ప్రజలు .

# 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బెల్లంపల్లిలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల బజార్ ఏరియా,1996-1997 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పద్మశాలి భవనంలో వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా విద్యను బోధించిన ఉపాధ్యాయులను గౌరవంగా సన్మానించారు ,విద్యార్థుల యొక్క జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉపన్యాసాలు చేశారు.ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు సందేశాన్ని కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరిశ్చంద్రరావు, శ్రీధర్ శ్యాంసుందర్, ఇంద్రసింగ్ సారంగపాణి లక్ష్మీకాంతయ్య ఆనందచారి, సువర్ణ ,శ్రీలత లక్ష్మిలను పూర్వ విద్యార్థులు



ఘనంగా సన్మానించారు . ఉపాధ్యాయుల సేవలకు జ్ఞాపకార్థంగా మెమోంటో ఇవ్వడం జరిగినది.విద్యార్థులు సంతోషంగా ఈ ఆత్మీయ సమ్మేళనము పండుగ వాతావరణంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు

# ప్రైవేట్ పాఠశాల పనితీరుపై వినతిపత్రం



తెలంగాణ బీసీ దళ్ విద్యార్థి విభాగం -పరకాల మండలం అధ్యక్షుడు జునుమల వెంకటేష్ పరకాల మండల్ ఎం ఇ ఓ గారికి ప్రవేట్ పాఠశాల యజమాన్యం పని తీరుపై ఎం ఇ ఓ రమాదేవి గారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. వెనుకబడిన పేద పిల్లలను చదువులకు ప్రవేటు పాఠశాలలకు పంపిస్తే వారు ఇదే అసరగచేసుకొని అధిక మొత్తంలో పిజులు వసూలు చేస్తూ, వయసుకు మించిన పుస్తకాల బరువుతో, వాహనాలలో పరిమితికి మించి ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారు. ఈ విషయంపై ఎం ఇ ఓ గారిని కలిసి వినతి పత్రం అందజేశారు దీనిపై అధికారులు స్పందించి వెంటనే చర్య తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ దళ్ మండల్ అధ్యక్షుడు అడపా నాగరాజు,ఉపాధ్యక్షుడు శ్రీనివాస్,సహాయ కార్యదర్శి రాగుల నాగరాజు, కమిటీ సభ్యులు రాకేష్ .రామక ృష్ణ .సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వానలతో ఊపిరి

వానలతో రైతాంగం ఊపిరి పిల్చుకున్నారు. పంటలు ఎండిపోయే ప్రమాదమొచ్చిన దశలో కురిసిన ఈ వానలతో రైతు కండ్లలో, పొలాల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ముసుర్లకు చాలామందిరైతులు పంటలను సాగు చేశారు. అత్యధికంగా తొలకరి జల్లులకు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. అనంతరం కురిసిన వర్షాలకు పప్పు ధాన్యాలు, వరి పంటల సాగు మొదలుపెట్టారు. తీరా నాట్లు అయ్యాక, మొలకలు ఎదిగే సమయంలో వర్షాలు వెనుకంజ వేశాయి. జూన్‌లో అడపాదడపా వర్షాలు కురిశాయి. జూలైలో మాత్రం సాధారణ వర్షాపాతం కంటే చాలా తక్కువగా వర్షాలు పడ్డాయి. ఫలితంగా పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడింది. ఇతర రాష్ట్రాల్లో వరుణుడు బీభత్సం సృష్టిస్తుంటే.. తెలంగాణలో మాత్రం వానలు లేక అల్లాడిపోతుండడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. పంటలు బతకడం కష్టమనుకుంటున్న సమయంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతుల్లో జీవం వచ్చింది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటల సాగుకు పెట్టుబడి కోసం రూ.4 వేల చొప్పున అందించిన ప్రభుత్వం, వరుణుడు కనికరించకపోవడంతో ఒకింత నిరాశలో ఉంది. తాజాగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు నిండుకుండలా మారడంతో ప్రభుత్వంలోనూ ఉత్సాహం పెరిగింది.పత్తి విత్తనాలు విత్తిన నెలన్నర రోజులకే పిండి మందు పెట్టాలి. రెండు నెలలకు రసాయనిక ఎరువులను పిచికారీ చేయాలి. పూత, కాత అప్పుడే మొదలవుతుంది. కానీ ప్రస్తుతం వర్షాలు లేక చేను నాలుగాకులకే పరిమి తమైంది. దీంతో రైతాంగం తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది.

తొలి పలుకు
First voice
తొలి పలుకు పత్రికకు రిపోర్టర్లు, ఫోటో జర్నలిస్టులు కావలెను
సంప్రదించండి
8885629415 / 8712811991/8790207749
ఈమెయిల్: tholipalukunews@gmail.com

Printed, Published and Owned by D.KUMARA SWAMY, Printed at M/s SRI CHARAN OFFSET PRINTERS, D.No. 1-1-178/A Chikadapally, Hyderabad - 500 020. Telangana State and published from Flat No. 402 & 403, Maheshwari Apartments, 4th Floor, Opp : Ganajpath Complex, Yosufguda, Hyderabad, Telangana State. Editor : D.KUMARA SWAMY, RNI Reg.No. TELTEL/2017/74417 Cell : 9959912341, email : tholipalukunews@gmail.com.